సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 23.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 123
పేజీలు: 12 వెల: రూ. 5


# దక్షిణాఫ్రికా చేతిలో చిత్తు

## ఛేజింగ్‌లో భారత బ్యాటర్ల వైఫల్యం

- దంచికొట్టిన మిల్లర్, బ్రేవిస్, స్టబ్స్
- 187/7 తో భారీ స్కోరు సాధించిన సఫారీలు
- లాస్ట్ ఓవర్ లో భారీగా 20 పరుగులిచ్చిన హార్దిక్
- లంకను లంకలో కొట్టి సూపర్ 8లో ముందుకెళ్లిన ఇంగ్లండ్

11





- ఆపరేషన్ కగార్ దెబ్బకు కూలిన మావోయిస్టు కోట
- ఎన్‌కౌంటర్లు.. లొంగుబాట్లు.. క్షీణిస్తున్న ఎర్ర దళాలు
- దున్నే వాడికే భూమి నుంచి.. లొంగుబాటు దాకా ఎర్ర ప్రయాణం
- రక్తపాతం నుంచి శాంతి దారి.. మారుతున్న అడుగులు
- మిషన్-2026 టార్గెట్.. వామపక్ష పోరాటానికి కష్టకాలం?
- ఎర్ర జెండా మసకబారుతోంది.. అడవుల్లో విప్లవానికి ఎసరు?

# నక్సల్‌బరి టు లొంగుబాటు

## దండకారణ్యం జల్లెడ.. మావోయిస్టులకు మార్గం మూసుకుపోయిందా?

### చుట్టుముట్టడంతో ఆయుధాలు వదిలేస్తున్న అగ్రనేతలు

1967, మే 25 రోజున ఉత్తర బెంగాల్‌లోని నక్సల్బరీ గ్రామంలో విసిరిన ఒక విప్లవ విత్తనం.. భారత సామాజిక ముఖచిత్రాన్ని మారుస్తుందని ఎవరూ ఊహించలేదు. మార్చి 2న ఒక గిరిజన యువకుడి నాగలిని భూస్వామ్య అహంకారం అడ్డుకుంటే, ఆ అవమానం నుంచి పుట్టిన ఆక్రోశమే చారు మజుందార్ నేతృత్వంలో ఒక మహా ప్రవాహమైంది. "దున్నేవాడికే భూమి" అన్న నినాదం.. అడవి బిడ్డల ఆత్మగౌరవమై ఎగిసింది. ఖాకీ నిప్పులకు తొమ్మిది మంది గిరిజనులు బలైతే, ఆ నెత్తుటి చుక్కలే దేశవ్యాప్తంగా వేల మంది యువతను ఎర్రజెండా వైపు నడిపించాయి. దశాబ్దాల పాటు దండకారణ్యం విప్లవ గీతాలతో ప్రతిధ్వనించింది. అణచివేతపై తుపాకీ గొట్టమే పరిష్కారమని నమ్మిన ఆ పోరాటం, ఎందరో మేధావులను, కవులను, గిరిజనులను తనలో లీనం చేసుకుంది. కానీ కాలం మారింది. నాడు దావానలంలా వ్యాపించిన ఆ ఉద్యమం, నేడు 'ఆపరేషన్ కగార్' నీడలో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆశయాల హోరు తగ్గి.. ఆయుధాల మోత సన్నగిల్లుతోంది. అడవిని నమ్ముకున్న అగ్రనేతలు ఒక్కొక్కరుగా జనజీవన స్రవంతిలోకి వస్తుంటే, విప్లవ బాటలో మౌనం ఆవహిస్తోంది. నాడు భూస్వాముల గుండెల్లో నిద్రపోయిన ఆ ఎర్రజెండా ప్రస్థానం.. నేడు ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది.

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఎన్నో విజయాలు.. రక్తం ఏరులై పారుతున్న ఆగని పోరాటం.. ఏండ్ల తరబడి అరణ్య వాసం.. మధ్య మధ్యలో ఎన్నో మలుపులు.. ఎందరో కోవర్టులు.. మరెందరో ప్రాణ త్యాగం చేసిన పార్టీ ఇప్పుడు ఆయుధాలు వీడింది. నాటి నక్సలైట్.. ఆ తర్వాత పీపుల్స్ వార్ .. 20 ఏండ్ల కిందట మావోయిస్టు పార్టీగా రూపాంతరం చెందిన విప్లవ పార్టీ ఇప్పుడు అడవిని వీడిపోయింది. ఆయుదాలు వీడుతాం.. కాల్పులు విరమిస్తాం అటూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ అలియాస్ మల్లోజుల వేణుగోపాల్ ప్రకటించిన రెండు నెలల్లో ఆయుధాలు అప్పగించింది.

**ఆయుధం వీడిన అన్నలు**

మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కేంద్ర మావోయిస్టు ప్రధాన పార్టీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి సహా 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అగ్రనేతలు దేవ్ జి, రాజిరెడ్డి సహా 16 మంది మావోయిస్టులు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వరుస మిగతా 02లో




# చల్లారని కామారెడ్డి

## కాంగ్రెస్, బీజేపీ నేతల సవాళ్లు ప్రతిసవాళ్లు



- ఎమ్మెల్యే కాటేపల్లి, పార్టీ శ్రేణులకు రాష్ట్ర నాయకుల మద్దతు
- బాన్సువాడ వెళ్లేందుకు సిద్ధమైన రాష్ట్ర నాయకులు
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- బీజేపీ నాయకులు జిల్లాలో ప్రవేశించకుండా చెక్ పోస్టులు
- హైదరాబాద్ లో టీబీజేపీ చీఫ్ హౌజ్ అరెస్ట్
- ప్రభుత్వ తీరుపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి ఆగ్రహం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కామారెడ్డిలో స్ధానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ వర్గాల మధ్య తలెత్తిన వివాదం రాష్ట్ర రాజకీయాలను హీటెక్కించింది. ఎమ్మెల్యే కాటేపల్లి ప్రభుత్వ పాఠశాల, కాలేజీ భూములను కబ్జా చేశారంటూ షబ్బీర్ అలీ చేసిన ఆరోపణలు ఈ ఆందోళనలకు ఆజ్యం పోసింది. భూ కబ్జా ఆరోపణలను నిరూపించాలంటూ కాటేపల్లి చేసిన సవాల్ కు షబ్బీర్ అలీ 'సై' మిగతా 02లో

# ఫ్యాబ్‌సిటీలో ఫార్మా, ఐటీ కంపెనీలు

## రెండేళ్లలో పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు

- ప్రణాళికల రూపకల్పనలో రెవెన్యూ, ఇండస్ట్రియల్ అధికారులు
- ఏడాది క్రితమే 922 ఎకరాలున్నా డీ నోటిఫై చేసిన కేంద్రం
- భారత్ ఫ్యూచర్ సిటీతో ఫ్యాబ్ సిటీ అనుసంధానం

09





# సెల్‌ఫోన్‌లో విద్యుత్ సేవలు

## వినియోగదారులకు కొత్త సౌకర్యం

- వాట్సాప్ చాట్‌బాట్‌తో ఫిర్యాదులు, బిల్లింగ్ వివరాలు క్షణాల్లో
- 'హాయ్' మెసేజ్‌తో సేవలు.. 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకోండి
- వినియోగదారులకు వేగవంతమైన, సురక్షిత సేవలపై టీఎస్ఎస్పీడీసీఎల్ దృష్టి

03



# ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్

- శివాజీ విగ్రహావిష్కరణకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- పెద్దశంకరంపేటలో ఉద్రిక్తత
- బీజేపీ, హిందూ సంఘాల నిరసన
- అరెస్ట్ అన్యాయం: రాజాసింగ్

09



# మురళీకృష్ణుడిగా నృసింహుడు

## తిరు వీధుల్లో ఊరేగిన స్వామివారు

## స్వామి సేవలలో ప్రముఖులు

03



# కరీంనగర్ కొత్త కొలువు.. సవాళ్ల పెద్ద కొలువు!

## అభివృద్ధి హామీలు vs నేలస్థాయి వాస్తవాలు

- కొత్త పాలకవర్గానికి అసలైన పరీక్ష మొదలు!
- అసంపూర్తి పనులు, ట్రాఫిక్ జామ్‌లు
- కరీంనగర్ ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా?
- 24 గంటల నీటి హామీ కాగితం మీదేనా

10



మార్పు నినాదంతో గద్దెనెక్కిన కొత్త పాలకవర్గానికి కరీంనగర్ నగరం 'సవాళ్ల భాండాగారం'గా కనిపిస్తోంది. గత పాలకుల వైఫల్యాలను ఎండగట్టి, కమలం జెండా ఎగురవేసిన బీజేపీ నేతృత్వంలోని నూతన మున్సిపల్ బోర్డు ముందు ఇప్పుడు సమస్యలు చాలా ఉన్నాయి. అట్టహాసంగా ప్రకటించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు సగంలోనే ఆగి వెక్కిరిస్తుంటే.. అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారి ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఓట్లు పొందిన కొత్త మేయర్ పీఠం.. పెండింగ్‌లో ఉన్న సీఎం హామీ పథకాలు, తాగునీటి ఎద్దడి, అస్తవ్యస్త పారిశుధ్యం వంటి జఠిల సమస్యలను ఎలా అధిగమిస్తుందో వేచి చూడాలి.

**-ముద్ర ప్రతినిధి, కరీంనగర్:**


# నీటి ప్రాజెక్టులకు రేవంత్ మార్క్ వేగం

## భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్!

- జూన్ 2లోపు భూసేకరణకు రూ.600 కోట్లు విడుదల
- ప్రాజెక్టుల అంచనాలపై బడ్జెట్‌లో పూర్తి ఆమోదం

09





**వ్యవసాయంలో టాప్ 1 దేశం**



**అమెరికా (USA)**

ఆధునిక యంత్రాలు, టెక్నాలజీతో భారీ స్థాయిలో వ్యవసాయం జరుగుతుంది. గోధుమ, మక్కజొన్న, సోయాబీన్ ఉత్పత్తిలో ప్రపంచానికి ప్రధాన సరఫరాదారు.

# నక్సల్బరీ టు లొంగుబాటు



**(మొదటి పేజీ తరువాయి)**

ఎన్ కౌంటర్లలో మావోయిస్ట్ అగ్రనేతలు పలువురు ప్రాణాలు కోల్పోతుంటే, మరోవైపు అదే స్థాయిలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. రెండు నెలల క్రితం ఆసిఫాబాద్ అడవుల్లోని సిర్పూర్ యు అడవి ప్రాంతంలో 16 మంది మావోయిస్టులు లొంగిపోగా.. తాజాగా రాష్ట్రస్థాయి మావోయిస్టుల అగ్రనాయకత్వం జిల్లా పోలీసుల ముందు లొంగిపోయినట్లుగా తెలుస్తోంది. పోలీసులు అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది. పోలీసులు రెండు రోజుల్లో మీడియా ముందుకు దేవ్‌జీ, రాజిరెడ్డిలను తీసుకువచ్చే అవకాశం ఉంది. ఆసిఫాబాద్ అడవులలో లొంగిపోయిన కేంద్ర మావోయిస్టు ప్రధాన పార్టీ సెక్రటరీగా ఉన్న దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతితో పాటు, కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి సహా 16 మంది కలిసి లొంగిపోయారు. ప్రస్తుతం వీరు పోలీసుల అదుపులో సురక్షితంగా ఉన్నారు. ఒకప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న ఆసిఫాబాద్ కాగజ్ నగర్ అటవీ ప్రాంతాలు తమ ప్రాబల్యాన్ని కోల్పుతున్నాయి. శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో మావోయిస్టు అగ్ర నేతలు దేవుజీ, రాజిరెడ్డి సహా 16 మంది మావోయిస్టులు ఆసిఫాబాద్ పోలీసుల ఎదుట లొంగిపోయారని ప్రచారం జరుగుతోంది.

**ఆపరేషన్ కోఆర్డినేటర్**

తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆపరేషన్ కగార్–2 పేరుతో రెండు వేల మంది బలగాలతో అగ్రనేతల కోసం వేట మొదలైంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న మార్చి 31 గడువు దగ్గర పడుతోంది. కేవలం ఇంకో నలభై రోజులు మాత్రమే మిగిలి ఉంది. అందుకే ఈ లోగా ఉన్న మావోయిస్టులను తుదముట్టించాలని ప్రభుత్వం ఆపరేషన్‌ను తీవ్రం చేసింది. దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తి స్థాయిలో తుడిచి పెట్టాలనే కేంద్ర ప్రభుత్వ మిషన్ –2026 గడువు సమీపిస్తున్న వేళ తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వాతావరణం వేడెక్కింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు అత్యంత వ్యూహాత్మకమైన ఆపరేషన్ కగార్‌ను పునఃప్రారంభించాయి. ఈసారి కర్రె గుట్టల హిల్స్‌ను టార్గెట్ చేసుకున్నట్టు సమాచారం. అందుకే దీనికి ఆపరేషన్ కేజీహెచ్–2ను ప్రారంభించాయి. ఒకవైపు సరిహద్దుల్లో రెండు వేల మంది సాయుధ బలగాల మోహరించారు. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అటవీప్రాంతాల్లో అగ్రనేత బడే చొక్కారావు, అలియాస్ దామోదర్‌తోపాటు బడానేతలు సంచరిస్తున్నారనే సమాచారరంతో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.

**అగ్రనేతలే లక్ష్యంగా భారీ వ్యూహం**

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న మార్చి 31 గడువు దగ్గర పడుతోంది. కేవలం ఇంకో 40 రోజులు మాత్రమే మిగిలి ఉంది. అందుకే ఈ లోపు ఉన్న మావోయిస్టులను తుదముట్టించాలని ప్రభుత్వం ఆపరేషన్‌ను తీవ్రం చేసింది. సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ కేజీహెచ్–2 చేపడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నంబి ప్రాంతం నుంచి వ్యాపించి ఉన్న కర్రెగుట్టల అడవుల్లో ఈ వేట కొనసాగిస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జి అలియాస్ చేతన్, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోఢీ, బడే చొక్కారావులాంటి పెద్ద తలకాయలను పట్టుకోవడమే లక్ష్యంగా రెండు వేలకుపైగా బలగాలతో అడవిలో అణువణువూ గాలింపు చర్యలు చేపట్టారు. గతేడాది ఏప్రిల్‌లలో ఇదే కర్రెగుట్టల్లో నిర్వహించిన 21రోజుల సుదీర్ఘ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చారు. కానీ అగ్రనేతలు మాత్రం తప్పించుకున్నారు. ఈ సారి వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకూడదనే పట్టుదలతో బలగాలు ఉన్నాయి. ఇదే సమయంలో దామోదర్ మినహా అగ్రనేతలు లొంగిపోయారు.

**ఉమ్మడి వరంగల్ సరిహద్దుల్లో దామోదర్ కోసం వేట**

తెలంగాణలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ షెల్టర్ తీసుకున్నారని పక్కా సమాచారం అందింది. అందుకే ఈ ప్రాంతాల్లో కూడా హై అలర్ట్ ప్రకటించారు. దామోదర్ స్వస్థలమైన తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆ గ్రామం నుంచి కీలక సమాచారం బయటకు వెళుతుందని అనుమానంతో నిఘా విభాగం, గ్రేహౌండ్స్ దళాలు అప్రమత్తమయ్యాయి. పెద్దాపూర్, కొప్పుగుట్ట, గండికామారం వంటి ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

**మావోయిస్టులను వేటాడుతున్న దళాలు..**

మావోయిస్టు రహితంగా దేశాన్ని మార్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ చేపట్టి పలువురు మావోయిస్టులను మట్టుపెట్టారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, PLGA 1వ బెటాలియన్ మాస్టర్ మైండ్ మాడ్వి హిడ్మా గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఆంధ్రప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇటీవల మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న పాక హనుమంతు సైతం ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. సుదీర్ఘ కాలం పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న బర్సే దేవా మరికొందరు కీలక మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. కొద్ది నెలల క్రితం 200 మందికి పైగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సీఎం, హోం మంత్రి ముందు లొంగిపోయారు. వీరిలో 98 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత కూడా లొంగిపోయారు. మహారాష్ట్ర సీఎం ఎదుట కూడా వందల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 15 మంది ఉన్నారు. వీరిలో కేంద్ర కమిటీలో ఇద్దరు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నట్లు డీజీపీ వెల్లడించారు.

**కర్రెగుట్టల్లో మరణమృదంగం..**

మావోయిస్టు పార్టీకి షెల్టర్ జోన్ అయిన కర్రె గుట్టల నుంచి చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. కర్రెగుట్టల మీదుగా రోడ్డు నిర్మాణం జరగుతోంది. తెలంగాణలోని పామునూరు నుండి చత్తీస్ గడ్ లోని తడపాల వరకు రహదారి వేసే పనిలో నిమగ్నం అయ్యాయి బలగాలు. ఇందులో భాగంగానే వివిధ రంగాల్లో సుశిక్షుతులగా ఉన్న జవాన్లను కర్రె గుట్టలపై మోహరించినట్టుగా తెలుస్తోంది. గత సంవత్సరం జనవరిలో మావోయిస్టులకు మెయిన్ షెల్టర్ జోన్ గా ఉన్న కర్రె గుట్టలపై భద్రతా దళాల దృష్టి పడింది. ఈ గుట్టలను స్వాధీనం చేసుకోవాలన్న లక్ష్యంగా ఏప్రిల్, మే నెలలో భారీ ఆపరేషన్ కు శ్రీకారం చుట్టారు. సహజ సిద్ధంగా ఏర్పడిన వనరులతో పాటు సహజంగా ఏర్పడిన సొరంగాలు, వన సంపద విస్తరించి ఉన్న కర్రె గుట్టలను సునిశితంగా పరిశీలించిన ఉన్నతాధికారులు దానిపై స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. దీంతో కర్రె గుట్టలపై షెల్టర్ తీసుకునే మావోయిస్టులు అక్కడి నుండి వెళ్లిపోవడంతో బలగాలు అణువు అణువు తనిఖీలు చేపట్టాయి. మందుగుండు సామాగ్రిని గుర్తించిన బలగాలు వాటిని నిర్వీర్యం చేశాయి. ఈ క్రమంలోనే తెలంగాణలోని పామునూరు మీదుగా, చత్తీస్ గడ్ లోని తడపాల మీదుగా కేంద్ర రిజర్వు బలగాలు కర్రె గుట్టలపై రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. ఈ ఏడాది జనవరి 26న ఇరువైపులా ఏర్పాటు చేసిన క్యాంపుల్లో గణతంత్ర వేడుకలు కూడా నిర్వహించారు. అయితే ఇక్కడ శాశ్వత రోడ్డు నిర్మాణం జరపాలన్న లక్ష్యంతో బలగాలు ముందుకు సాగాయి. సాధారణ కూంబింగ్ జరిపే బలగాలతో పాటు క్విక్ రియాక్షన్ టీమ్స్ (QRT), రోడ్ సైడ్ కూంబింగ్ ఆపరేషన్ టీమ్స్ (RSCO), మైన్ డిఫ్యూజ్ పార్టీలు ఇలా ఆయా విభాగాల్లో నిష్ణాతులుగా ఉన్న బలగాలు అక్కడ పని చేస్తున్నాయి. ప్రధానంగా బాటిల్ బాంబ్స్, మందు పాతరలను పెద్ద ఎత్తున గుర్తిస్తున్న బలగాలు వాటిని నిర్వీర్యం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. వేల సంఖ్యలో బాటిల్ బాంబ్స్, మందు పాతరలను మావోయిస్టులు అమర్చినట్టుగా బలగాలు గుర్తించడంతో వాటిని డిఫ్యూజ్ చేస్తూ తొలగిస్తున్నాయి. పేలుడు పదార్థాల నిర్వీర్యం ప్రక్రియ పూర్తి కాగానే శాశ్వత రోడ్డు నిర్మాణం జరిపనున్నట్టుగా సమాచారం.

**ట్రైనింగ్ క్యాంప్**

మార్చి నెలలో ఈ ఆపరేషన్ పూర్తి చేసిన తరువాత కర్రె గుట్టలపై ప్రత్యేకంగా ట్రైనింగ్ క్యాంపు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇక్కడ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్టయితే భవిష్యత్తులో నక్సల్స్ కార్యకలాపాలకు అస్కారం లేకుండా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా అత్యంత ఎత్తుగా ఉన్న ఈ గుట్టల మీదుగా పరిశీలించినట్టయితే మావోయిస్టుల ఉనికి కనిపించే అవకాశాలు ఉంటాయని కూడా గుర్తించారు. దీంతో పరిసర ప్రాంతాల్లో కూడా మావోయిస్టుల ఉనికికి ఏ మాత్రం అవకాశం లేదని అంచనా వేస్తున్నారు.

**చర్చలే ప్రాణాలు తీశాయి..**

శాంతి చర్చల రూపంలో మావోయిస్టు పార్టీ దెబ్బతింటూనే ఉంది. కానీ, అభయ్ పేరిట విడుదల అయిన లేఖలో శాంతి చర్చల అంశాన్ని ప్రస్తావించారు. 2024లో చత్తీస్ గడ్ రాష్ట్రంలో శాంతి చర్చల అంశం తెరపైకి వచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందంతో పాటు బేస్ క్యాంపుల ఏర్పాటును నిలిపివేయాలని, గాలింపు చర్యలను నిలిపివేయాలని అప్పుడు మాత్రమే తాము చర్చలకు ముందుకు వస్తామని మావోయిస్టు పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇదే సమయంలో చత్తీస్ గడ్ రాష్ట్రంలోని దండకారణ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టు ఏరివేత ముమ్మరంగా సాగింది. ఆ తరువాత శాంతి చర్చల ప్రతిపాదన అంశం మరుగునపడిపోయింది. శాంతి చర్చలకు నక్సల్స్ ముందుకు వచ్చినప్పటికీ ఏరివేతే లక్ష్యంగా బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పట్టాయి. ఆ తరువాత చర్చల అంశం అంతగా చర్చకు రాకుండా పోయింది. అటు రాష్ట్రంలో పీపుల్స్ వార్ తో చర్చల సందర్భంగా ఆర్ కే, గాజర్ల రవి, జనశక్తి రియాజ్, అమర్, ప్రజా సంఘాలతో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చర్చలు చేసింది. కానీ, చర్చలు జరుపుతుండగానే.. కరీంనగర్, నిజామాబాద్ సరిహద్దులో మానాల ఎన్ కౌంటర్, ఇక్కడ జనశక్తి రియాజ్ హత్యతో చర్చలు ఆగిపోయాయి.

**అతలాకుతలం చేసిన ఆపరేషన్ కగార్**

మావోయిస్టు పార్టీని ఆపరేషన్ కగార్ అతలాకుతలం చేసింది. ఏకంగా కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావును ముట్టబెట్టింది. కేంద్ర పరిధిలోని సాయుధ బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పట్టాయి. కనిపించిన మావోయిస్టును చంపేశాయి. నిర్బంధం తీవ్రతరం చేశాయి. ఈ నిర్బంధం ఎంతలా అంటే.. అడవుల్లో అన్నలకు కనీసం తిండి కూడా దొరకని పరిస్థితులను తెచ్చి పెట్టింది. ఇలా తిండి కోసం బయటకు వచ్చిన మావోయిస్టు కేంద్ర నాయకత్వాన్ని టార్గెట్ చేసి ఏరిపారేశారు. నంబాల ఎన్ కౌంటర్ కు ముందు ఏకంగా 10 రోజుల పాటు ఆయన కేవలం ఓఆర్ ఎస్ ప్యాకెట్లతోనే ఆకలి తీర్చుకున్నాడని విప్లవ సంఘాలు ఆరోపించాయి. పది రోజుల తర్వాత ఆకలికి తట్టుకోలేక ఆహారం కోసం బయటకు వచ్చిన పార్టీ ప్రధాన కార్యదర్శిని కాల్చి పడేశాయి సాయుధ బలగాలు. ఇలా ఇటీవల ఎన్ కౌంటర్ లో హతమైన వారంతా ఇలా తిండి కోసమో.. అనారోగ్య సమస్యలతో బయటకు వచ్చినవారే.

**25 ఏండ్లలో 4875 మంది ఎన్ కౌంటర్**

2020 నుంచి మావోయిస్టు పార్టీ వరుసగా ఎదురుదెబ్బలతో సతమతమవుతున్నది. మావోల ఏరివేత కోసం కేంద్రం ఏకంగా 3,13,634 మందితో సీఆర్ పీఎఫ్ బలగాలను పెంచి పోషిస్తోంది. వీరితో పాటు ఆయా రాష్ట్రాల పోలీసు బలగాలు 12.89 లక్షల మంది అదనం. కేంద్రం లెక్కల ప్రకారం జిల్లా, రాష్ట్ర, కేంద్ర కేడర్ లో మావోయిస్టులు 2009 నుంచి 2013 వరకు 20 వేల మంది ఉంటే.. 2013 వరకు ఈ సంఖ్య 9,500కు చేరిందని వెల్లడించారు. కానీ, 2020 నుంచి 2025 వరకు లెక్కేస్తే.. తిరుగుబాటుదారులు కేవలం 600 మంది మాత్రమే అంటూ చెబుతున్నారు. ఈ 25 ఏండ్లలో సాయుధ బలగాల ఎన్ కౌంటర్ లో 4875 మంది మావోయిస్టులు హతమైతే.. 18,163 మంది లొంగిపోయారు. 16,984 మంది పట్టుబడినట్లు గణాంకాలు వెల్లడించాయి.

**ఆయుధాలు అప్పగించారు**

మొన్నటికి మొన్న నంబాల కేశవరావు, గాజర్ల రవి, సహదేవ్, రామచంద్రారెడ్డ, హనుమంతు వంటి కేంద్ర కమిటీ నేతలు ఎన్ కౌంటర్ లో ప్రాణాలు కోల్పోతే.. మావోయిస్టు పార్టీ ఆత్మ రక్షణలో పడినట్లు కేంద్రం ప్రకటించింది. నిజానికి, దండకారణ్యంలోకి కేంద్ర బలగాలు చొచ్చుకువెళ్లాయి. గిరిజన తండాల్లో మకాం వేశాయి. నిర్బంధాన్ని పెంచారు. ఫలితంగా మావోయిస్టులు అడుగు తీసి అడుగు వేయాలంటే భయపడుతున్నాయి. కానీ, ఇంకా ఏపీ, తెలంగాణ, ఒడిశా, చత్తీస్ ఘడ్, బస్తర్, దండకారణ్యంలో 38 జిల్లాల్లో మావోల ప్రభావం ఉందని బిహార్ పోలీసుల నివేదిక స్పష్టం చేస్తోంది. కానీ, ఇలాంటి సమయంలో ఆగస్టు 15న కేంద్రానికి.. మావోయిస్టు పార్టీ నుంచి రాసినట్లుగా ఒక లేఖ బయటకు వచ్చింది. ఆయుధాలు వీడి.. చర్చకు సిద్ధం అంటూ ఆ లేఖ సారాంశం. లేఖ రాసింది అభయ్ అలియాస్ వేణుగోపాల్ రావు. ఈ లేఖ చక్కర్లు కొడుతుండగానే.. ఒక ఆడియో బయటకు వచ్చింది. దాదాపు 8.35 నిమిషాల నిడివితో ఉన్న ఈ ఆడియోలో మాట్లాడింది వేణుగోపాల్ రావు అని మాజీ మావోయిస్టులు స్పష్టత ఇచ్చారు. దీని వెనకే మరో లేఖ..ఇలా మొదలైన వెనకడుగు ప్రస్థానం ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది.

## గణపతి పరిస్థితి ఏంటి?

ఇప్పుడు మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం ఆయుధాలు అప్పగించి.. ఉద్యమానికి వీడ్కోలు పలికింది. ఇప్పుడు మావోయిస్టు లీడర్లు ఎవరైనా ఉన్నారా అంటే ఒక గణపతి.. ఇంకో దామోదర్ మాత్రమే అన్నట్లు ఉంది. కానీ, గణపతి దాదాపు 10 ఏండ్ల క్రితమే తీవ్ర అనారోగ్యంతో ఉన్నారు. ఆయన నడవలేని పరిస్థితుల్లో శ్రీలంకలో తలదాచుకున్నట్లు ఒక టాక్. ఇప్పుడు దామోదర్ ఒక్కడే మిగిలినా.. రేపో మాపో ఆయన కూడా లొంగిపోవాలి లేదా ఎన్‌కౌంటర్లతో సహవాసం చేయాల్సిందే. ఎటు చూసినా.. ఏండ్ల తరబడి ప్రభుత్వాలను గడగడలాడించిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు అత్యంత సవాళ్లను ఎదుర్కొంటోంది. విప్లవ పోరాటాలకు బ్రేక్ పడుతోంది.. మావోయిస్టు పార్టీ మళ్లీ పడిలేచిన కెరటంలా ఎగుస్తుందా? అగ్రనేతల లొంగుబాటుతో ఉద్యమం చతికిలపడుతుందా? మళ్లీ పురుడుపోసుకుంటుందా? అన్నది వేచిచూడాలి.



# మావోయిస్టు పార్టీ అగ్రనేతల లొంగుబాటు?

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**


మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న.. ఆదివారం లొంగిపోయారు. వీరితో సహా 16 మంది మావోయిస్టులు తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయినట్లు సమాచారం. అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

కాగా, కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ కారణంగా మావోయిస్టులకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తున్నారు. ఇప్పటికే పలువురు కీలక మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోగా.. తాజాగా మరో ముగ్గురు సీనియర్లు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నర్సింహారెడ్డి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆసిఫాబాద్ జిల్లాలో వీరు ఆయుధాలు వదిలి లొంగిపోయారు.

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ప్రస్తుతం.. కేంద్ర మావోయిస్టు పార్టీ సెక్రటరీగా ఉన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్‌జీ సారథ్యం వహిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్లా రాజిరెడ్డి పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇక, వీరి లొంగుబాటుతో మావోయిస్టులకు కోలుకులోని దెబ్బ తగిలినట్టు అయ్యింది.

**మధ్యవర్తులెవరు?**

మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, సంగ్రామ్‌లకు, ఎస్ఐబీ స్పెషల్ టీంకు మధ్యవర్తులుగా తెలంగాణలోని ఓ యూనివర్సిటీ ప్రొఫెసర్, కొంతమంది పౌరహక్కుల నేతలు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వీరితో రాష్ట్రానికి చెందిన ఓ కీలకనేత టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది.





# చల్లారని కామారెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**

అనడం.... ఈ నెల 20న అర్ధరాత్రి ఇరు పార్టీ శ్రేణులు రోడ్లపైకి రావడం.. మరుసటి రోజు కాటేపల్లి ఇంటిపై దాడికి కాంగ్రెస్ శ్రేణులు విఫలయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. మరోవైపు గత మూడు రోజుల నుంచి కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య నెలకొన్న సవాళ్లు ప్రతి సవాళ్లతో కామారెడ్డిలో యుద్ధ వాతావరణం నెలకొంది. కలెక్టరేట్ వేదికగా తేల్చుకుందామంటూ ఇరు పార్టీల నేతలు రంగంలోకి దిగడంతో పోలీసులు భారీగా మోహరించారు. కలెక్టరేట్ వద్దే అన్ని విషయాలు తేల్చుకుందామని ఎమ్మెల్యే పిలుపునివ్వడంతో రాజకీయ ఉత్కంఠ పరాకాష్టకు చేరింది. కాగా ఎమ్మెల్యే కావాలనే ప్రధాన సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు కామారెడ్డి పట్టణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు జిల్లాలో ప్రవేశించకుండా అడ్డుకునేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

**టీబీజేపీ చీఫ్ అరెస్ట్**

ఈ వివాదం నేపథ్యంలో బాన్సువాడ వెళ్లేందుకు ఆదివారం ప్రయత్నించిన పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులను హైదరాబాద్ పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. బీజేపీ నాయకులెవరూ కామారెడ్డి, బాన్సువాడ వైపు రాకుండా సరిహద్దు జిల్లాల్లో తనిఖీలు చేపట్టారు. తార్నాకలోని తన నివాసంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీంతో పోలీసుల తీరుపై రాంచందర్ రావు మండిపడ్డారు. బాన్సువాడలో తమ ఎమ్మెల్యేపై దాడి జరిగిందని ఆరోపించిన ఆయన కారును ధ్వంసం చేసింది కాంగ్రెస్ నేతలే అన్నారు. కానీ తిరిగి తమపైనే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే దాడులకు దిగడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని మండిపడ్డారు. అక్కడ బీజేపీ కార్యకర్తలు తమ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎట్టి పరిస్థితుల్లోనూ బాన్సువాడ వెళ్లి తీరుతామని రామచందర్ రావు స్పష్టం చేశారు. మరోవైపు రాంచందర్ రావు కు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు ఆయన ఇంటివద్దకు భారీగా చేరుకోగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో రాంచందర్ రావు, పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు.. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బాన్సువాడకు బయలుదేరిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ను పోలీసులు అక్కడ అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో భజరంగ్ దళ్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేసి రోడ్డుపై బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

**రాష్ట్రంలో రేవంతుద్దీన్ పాలన: ఎంపీ అర్వింద్**

రాష్ట్రంలో రేవంతుద్దీన్ అరాచక పాలన నడుస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. హౌజ్ అరెస్టులతో బీజేపీ నేతలను అణిచివేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాటేపల్లిపై దాడి జరిగి రెండ్రోజులు అవుతున్నా.. ఇప్పటివరకు స్పీకర్ ఆరా తీయకపోవడం దారుణమన్నారు. కేవలం 15 శాతం ఓట్ల కోసం ఎంఐఎంకు కాంగ్రెస్ నేతలు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కంటే.. రేవంత్ రెడ్డి వెరీ డేంజరస్ సీఎం అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కూడా పేర్లు మార్చుకోవాలని హితవు పలికారు. శ్రీధర్ బాబు.. శ్రీధర్ బాబాగా, భట్టి విక్రమార్క భట్టి అక్రమ్‌గా మార్చుకోవాలని సూచించారు.

**అక్కడే రాజీనామా చేస్తా : ఎమ్మెల్యే కాటేపల్లి**

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కామారెడ్డిలో శనివారం జరిగింది ట్రైలర్ మాత్రమేనన్న ఆయన.. అసలు సినిమా ముందుందన్నారు. తనను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తున్నారన్నారు. నేటి నుంచే గ్రామాల్లోకి వెళ్తానన్న ఆయన ఎవరు..? ఎలా..? అడ్డుకుంటారో చూస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ పోటీ చేసి ఓడిపోయినప్పటికీ అభివృద్ధి విషయంలో ఆయనకు స్వాగతం పలుకుతానన్నారు. కాలేజీ భూముల విషయంలో తనపై చేసిన ఆరోపణలను నిరూపించడానికి కాంగ్రెస్ నాయకులు రావాలని, సోమవారం నేనే కలెక్టరేట్‌కు వస్తానన్నారు. అక్కడ కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్‌లు కూడా ఉంటారన్నారు. వారి సమక్షంలోనే ఆధారాలను చూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానన్నారు.

**ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ అరాచకాలు : కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డి**

రాష్ట్రంలో ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఆరోపించారు. ఎంఐఎంను కాపాడటానికి కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం అమానుషమన్నారు. కామారెడ్డిలో జరిగిన గొడవలకు కాంగ్రెస్సే అగ్నికి ఆజ్యం పోసిందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. బండి సంజయ్ ఆదివారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడగా, కిషన్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రౌడీ రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు పునరావృతమవుతున్నాయని చెప్పారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ నేతలు దాడులకు తెగబడటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. బాన్సువాడ ఘటనలో రాళ్ల దాడి స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఆత్మరక్షణ కోసం ప్రయత్నిస్తే, తిరిగి తమపైనే దాడి చేశారని చెప్పడం సిగ్గుచేటని కౌంటర్ ఇచ్చారు. బాన్సువాడలో 70 మంది బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. బాన్సువాడ వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు అరాచకాలను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రెండేళ్ల పాలనలో జరిగిన అరాచక ఘటనలను ప్రజలు గుర్తుంచుకోవాలని, రౌడీయిజం చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని బండి వార్నింగ్ ఇచ్చారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వ్యవసాయంలో టాప్ 2 దేశం**



**చైనా (China)**
ప్రపంచంలోనే అతిపెద్ద రైతుల సంఖ్య కలిగిన దేశం. బియ్యం, గోధుమ, కూరగాయల ఉత్పత్తిలో అగ్రస్థానం.

# హరీశ్ రావు చిలక పలుకులు

- గాంధీ సరోవర్ నిర్వాసితులకు సంతృప్తి చెందేలా పరిహారం
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ జరుపుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఆదివారం గాంధీభవన్ లో ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. బాధితుల డిమాండ్ లను ప్రభుత్వం వింటుందన్న ఆయన నిర్వాసితులు సంతృప్తి చెందేలా పరిహారం ఇస్తామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు నిర్వాసితులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌కు నోటీసులు ఇచ్చామని అక్కడికి వెళ్లి తెగ సానుభూతి చూపిస్తున్నాడని విమర్శించారు. మల్లన్న సాగర్ కోసం 14 గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించినప్పుడు హరీశ్‌రావుకి ఇవి గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు చర్యలతో మల్లన్న సాగర్ బాధితులు అనేక మంది చనిపోయారని ఆరోపించారు. ఒకరు గ్రామం వదలలేక ఇంట్లోనే చితి పేర్చుకుని సజీవ దహనం చేసుకున్న సంఘటనను గుర్తు చేశారు. ఆ సమయంలో పోలీసులను పెట్టి బలవంతంగా గ్రామాల నుండి నిర్వాసితులను ఈడ్చి వేశారని అన్నారు. అందులో హరీశ్‌రావు పాపమే ఉందన్న ఆయన.. ఆ పాపాల భైరవుడు ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నాడని మండిపడ్డారు. మూసీ నిర్వాసితులపై తమకూ సానుభూతి ఉందనీ వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిర్వాసితులు ప్రతి పక్షాల వలలో చిక్కోద్దని సూచించారు. ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. మూసీ ప్రాజెక్టుపై హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. మూసీ ప్రక్షాళన చేయడం వాళ్లకు ఇష్టం లేదని మండిపడ్డారు. మూసీ బాగైతే హైదరాబాద్ ప్రజలు ఎప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ని గుర్తు పెట్టుకుంటారని బీఆర్ఎస్ భయపడుతోందని విమర్శించారు. గతంలో హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తానని కేసీఆర్ బడాయి కబుర్లు చెప్పారని గుర్తుకు చేశారు. మూసీ కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని గొప్పలు చెప్పిన కేటీఆర్.. ఆ నిధులను తానే మేసి... నగర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సంఘటనలపై స్పందిస్తూ.. రాళ్ల దాడి స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఆత్మరక్షణ కోసం ప్రయత్నిస్తే, తిరిగి తమపైనే దాడి చేశారని చెప్పడం సిగ్గుచేటని కౌంటర్ ఇచ్చారు. బాన్సువాడలో 70 మంది బీజేపీ (BJP) కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అలాగే, బాన్సువాడ వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు అరాచకాలను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన అరాచక ఘటనలను ప్రజలు గుర్తుంచుకోవాలని, రౌడీయిజం చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని బండి సంజయ్ వార్నింగ్ ఇచ్చారు.

# విద్యుత్ సేవలు మెరుగు

- త్వరలోనే వాట్సాప్ చాట్‌బాట్ సేవలు
- టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

**ముద్ర, హైదరాబాద్ :**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) తన వినియోగదారులకు మరింత సమర్థవంతమైన, సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఈ దిశగా వినియోగదారులు విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్..అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సేవ ద్వారా వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యుత్‌కు సంబంధించిన సమాచారాన్ని వేగంగా పొందగలుగుతారు. ప్రతి వినియోగదారుడు ఈ నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవడం ద్వారా విద్యుత్ సేవలను మరింత సులభంగా, సురక్షితంగా వినియోగించుకోవచ్చని సంస్థ పేర్కొంది.

# హత్యకేసులో వీడిన మిస్టరీ

- బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును చేదించిన కూసుమంచి పోలీసులు

**ముద్ర, ఖమ్మం:**

రచయిత, యూ ట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును ఖమ్మం జిల్లా కూసుమంచి పోలీసులు ఛేదించారు. శ్రీనివాస్ హత్యకు దారి తీసిన పరిస్థితులను, పరిణామాలను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీల వివాదమే శ్రీనివాస్ దారుణ హత్యకు దారి తీసినట్లు చెప్పారు. అశ్వారావుపేటకు చెందిన సుపారీ ముఠా శ్రీనివాస్ ను కత్తులతో పొడిచి, ఇనుపరాడ్లతో కొట్టి చంపినట్లు ఏసీపీ తెలిపారు. ఏసీపి తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. బొగ్గుల శ్రీనివాస్ హైదరాబాద్ లో నివసిస్తూ యూ ట్యూబర్ గా, రచయితగా ప్రాచుర్యం పొందాడు. శ్రీనివాస్ తో పాటు మేకల వేణుమాధవ్ రెడ్డి సిల్వర్ జూబ్లీ కాలేజీలో చదువుకున్నాడు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయమయ్యారు. శ్రీనివాస్ కు GST లైసెన్స్ ఉండగా, సబ్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్న వేణుమాధవ్ రెడ్డి జీఎస్టీ లైసెన్స్ ను వాడుకున్నాడు. ఈ క్రమంలో వారి మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఈమేరకు కుట్ర పన్నిన వేణుమాధవ్ రెడ్డి అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వర్ రావును, షేక్ అబ్దుల్ హఫీజ్ ను, మహ్మద్ అజ్మత్ ఆలీ ఖాన్ తో కలిసి శ్రీనివాస్ హత్యకు కుట్ర పన్నాడు. వారికి రూ. 5 లక్షల సుపారీగా చెల్లించాడు. చెల్లించాల్సిన డబ్బును ఇస్తామంటూ ఈనెల 13న రాత్రి శ్రీనివాస్ ను వేణుమాధవ్ రెడ్డి నమ్మించారు. 14న తెల్లవారుజామున నకిరేకల్ నుంచి జనగామ వైపునకు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రదేశంలో నిందితులు కత్తులు, ఐరన్ రాడ్లతో శ్రీనివాస్ తలపై కొట్టి, పొడిచి దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని కారులో తీసుకుని పాలేరు రిజర్వాయర్ లోకి పడేశారు. నాలుగు టీంలుగా దర్యాప్తు ను విజయవంతంగా పూర్తిచేసి, నిందితులను అరెస్ట్ చేశారు. కాగా ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు జరిపిన కూసుమంచి సీఐ సంజీవ్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎస్ఐలు నాగరాజు, సంతోష్, జగదీష్, ప్రొబేషనరీ ఎస్ఐ దివ్యలను ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు.

# యూనియన్ల ప్రతిపాదన మేరకే కమిటీలు

- వెబ్ సైట్ సమస్యలు పరిష్కరిస్తాం
- రాం నారాయణ కు హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి
- సమస్యలు పరిష్కరించాలని కోరిన టియుడబ్ల్యూజేఐజేయు బృందం
- కేబుల్ చానల్స్, చిన్న పత్రికలకు కూడా అక్రిడేషన్లు కల్పించాలని విజ్ఞప్తి



**ముద్ర ఖమ్మం :**

జర్నలిస్టు యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల అక్రిడేషన్, వెబ్ సైట్, కేబుల్ చానల్స్, చిన్న పత్రికల సమస్యలపై మంత్రి పొంగులేటి కి టియుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకుల బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ్ నారాయణ సారథ్యంలో ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రామ్ నారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44709 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, తమరు ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 50% కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయని, వెబ్ సైట్ ఓపెన్ చేస్తే అందులో అడిగే ప్రశ్నలు కార్డులు ఇచ్చేలా లేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. వెబ్సైట్ ఫార్మేట్ సులభతరంగా లేదని ప్రస్తావించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషనర్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీ లో సభ్యులుగా తీసుకున్నారని, ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించడానినీ తప్పు పట్టారు. ఇది అత్యంత విచారకరమన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత జీవో ప్రకారం కలెక్టర్ అందరిని నామినేట్ చేస్తారనే ఉందని , ఇది సాధ్యం కాదని, కలెక్టర్కు కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని పేర్కొన్నారు. మా విన్నపాన్ని పరిశీలించి గతంలో అక్రిడేషన్ కమిటీలు ఏ విధంగా ఏర్పాటు చేశారో అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని రామ్ నారాయణ మంత్రిని కోరారు. జీవో ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ చానల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని, దీంతో ఇబ్బందులు తప్పవనే ఆందోళనతో జర్నలిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికల వారు కూడా తమకు గతంలో మాదిరిగా కార్డులు రావని ఆందోళనలో ఉన్నారని, కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అన్యాయమే జరుగుతుందని వివరించారు. గతంలో వారు కార్డులు పొందినప్పటికీ , ఈసారి కార్డులు రావని ఆందోళన చెందుతున్నారని 20 నిమిషాల పాటు అన్ని అంశాలపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అక్రిడేషన్ వెబ్ సైట్ ను సరళీకరణ చేస్తామన్నారు. అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందని, జర్నలిస్టులు, సంఘాల నాయకులు ఆందోళన చెంద వద్దన్నారు. అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మోయినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగినాటి మాధవరావు, జిల్లా నాయకులు ఏలూరు వేణుగోపాలరావు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిని పరిరక్షించుకుందాం

- ఎస్టీయూ రాష్ట్ర విద్యా సదస్సులో ప్రొఫెసర్ కాశీం




**ముద్ర, కాచిగూడ:**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నదని ప్రొఫెసర్ కాశీం అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్టీయూ టియస్) ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన విద్యా సదస్సులో ప్రముఖ విద్యారంగ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కాశీం ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను మూసివేసే ఆలోచన విరమించుకోవాలని, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని వారు కోరారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు విద్యారంగంలో పోటీపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరులతోపాటు, భౌతిక వనరులను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, పాఠశాలలకు నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు సృజనాత్మకతతో పాటు గుణాత్మక విద్య అందించడంలో ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణలో ఎస్టీయూ బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తున్నదని వారు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందన్నారు. ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఉమ్మడి ఉద్యమాలకు సంసిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పీఆర్సీ, డిఏల సాధన కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ, సంఘ అధికార మాస పత్రిక ఎడిటర్ ప్రసాద్, సబ్ ఎడిటర్ శంకర్ మాతంగి,హెడ్ సెక్రటరీ కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏ.వి. సుధాకర్, శ్రీనివాసరెడ్డి, పోల్ రెడ్డి,రవీంద్ర,రాధా జయలక్ష్మి,శీతల్ చౌహాన్,నీరజ , శిరీష, అజర్ జహా, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నృసింహుడు.. మురళీకృష్ణుడు..



- మురళీకృష్ణుడిగా శ్రీ లక్ష్మీ నరసింహుడు
- తిరు వీధుల్లో ఊరేగిన స్వామివారు
- స్వామి సేవలలో ప్రముఖులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఆదివారం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం ఉదయం శ్రీ స్వామివారిని శ్రీకృష్ణాలంకారం (మురళీకృష్ణుడు) అలంకార శేవలో అలంకరించి భక్తుల దర్శనార్థం తిరువీధులలో ఊరేగింపు వేడుక నిర్వహించారు. ఈ వేడుకలను శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా ఆలయప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చకబృందం, పారాయణీకులు అత్యంతవైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె.భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ ఎమ్.హనుమంతరావు శ్రీ స్వామివారి అలంకార సేవను మోశారు. అనంతరం అర్చక స్వాములు శ్రీకృష్ణ అలంకారం విశిష్టతను శ్రీ స్వామివారి కల్యాణ మండపం వద్ద భక్తులకు వివరించారు.

**మురళీకృష్ణుడు అలంకార విశిష్టత**

భగవానుని దశావతారాలలో శ్రీకృష్ణ అవతారము ఎన్నో విశేషములతో కూడినది. శ్రీకృష్ణ భగవానుడు మురళీకృష్ణుడిగా (వేణుగోపాల స్వామి) జగత్ ప్రసిద్ధమైన తత్త్వమిది. వేణునాదము వేదనాదమని వైకుంఠంలోని తత్త్వమున కంటే ఆనందకరమైనదని భగవానుడు బృందావనంలో వినిపించే వేణునాదం అన్ని లోకాలను మైమరపింప చేస్తూ ఉందని మహర్షులు పొందిన ఆనందము మాటలకు అందనిదని భాగవతం చెబుతుంది. సామాన్యులు మొదలు బ్రహ్మాది దేవతల నిర్యంతము సమ్మోహన పరచిన ఈ వేణువు యొక్క వృత్తాంతమును స్మరిస్తే సర్వస్వము త్యజించి భగవానుని శరణు వేడిన తీరు ముక్తి ప్రదమని స్పష్టంగా కనిపిస్తున్నది వేణుగానం వినడం మురళీకృష్ణుడిని దర్శించడం కన్నులకు చెవులకు ఇంద్రియములన్నింటికీ కూడా ఉపశమనమని లీలాశుకులు అంటారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారు మురళీకృష్ణుడు అలంకారంలో భక్తకోటిని అనుగ్రహించుట విశేషమై యున్నది.




**ధార్మిక,సాహిత్య, సంగీత మహాసభలు (సాంస్కృతిక కార్యక్రమాలు)**

శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైన ధార్మిక,సాహిత్య, సంగీత మహాసభలు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీ వైష్ణవ సేవా సమాఖ్య వారిచే విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించారు. శ్రీవేంకటఅన్నమాచార్య సేవా ట్రస్ట్ వారిచే అలంకార సేవల ముందు కోలాటం, నృత్యములు చేశారు. హైదరాబాద్ కు చెందిన బ్రహ్మశ్రీ. మైలవరపు శ్రీనివాసరావు నవనారసింహ తత్త్వము యాదగిరి క్షేత్ర వైభవముగూర్చి ఉపన్యసించారు. యడవల్లి శ్రీనివాస్ భాగవతార్ చేసిన గజేంద్ర మోక్షము హరికథా గానం శ్రోతలను అలరించాయి.

**సాయంకాలం పొన్న వాహన శేవలో స్వామివారు**

ఆదివారం సాయంకాలం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం రాత్రి శ్రీ స్వామి వారిని పొన్నవాహన శేవలో అలంకరించి భక్తుల దర్శనార్థం తిరువీధులలో ఆలయప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా ఊరేగింపు వేడుక నిర్వహించారు.

**పొన్న వాహన శేవ ప్రత్యేకత**

దేవతా వృక్షముగా ప్రసిద్ధి పొందిన వృక్ష రాజములలో అత్యంత శ్రేష్ఠమైనది పొన్నవృక్షము. భగవానుడికి కూడా నిత్య నివాస స్థానముగా ప్రసిద్ధి పొందినది ఈ పొన్నవృక్షమే. ఈ పొన్నవృక్షము ఆశ్రితులకు కల్పతరువై వారియొక్క అనేక విధములైన కోరికలను నెరవేరుస్తూ ఉంటుంది. భగవానుడు సత్పురుషులకు నివాస వృక్షముగా ఉండునని వేదవాక్యము. అదియే ఈ పొన్నవాహన సేవలోని అంతరార్థము. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య వైభవ ఉత్సవ ఊరేగింపు వేడుకలో శ్రీ స్వామివారిని భక్తకోటి దర్శించి తరించుట ఈ అలంకార సేవ వేడుకలోని ప్రత్యేకత.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 23.02.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

న_కలం

## తెలంగాణలో మరో ఆధ్యాత్మిక అద్భుతం

# నూతన త్రివేణి సంగమ వైభవం



తెలంగాణ రాష్ట్రం జలకళతో ఉట్టిపడే జీవనదుల పురిటిగడ్డ. గోదావరి, కృష్ణ, ప్రాణహిత, ఇంద్రావతి వంటి నదులు ఈ నేలను సస్యశ్యామలం చేయడమే కాకుండా, తమ తీరాల్లో అద్భుతమైన సంస్కృతిని, ఆధ్యాత్మికతను దాచుకున్నాయి. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వెలుగులోకి వచ్చిన మరో 'త్రివేణి సంగమం' తెలంగాణ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది.

### వెలుగులోకి వచ్చింది ఇలా..

వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ చరిత్రకారులు శ్యాంసుందర్, నరేందర్, నాగేశ్వరరావు బృందం జరిపిన తాజా పరిశోధనల్లో ఈ అద్భుత క్షేత్రం బయటపడింది. కాళేశ్వరం క్షేత్రానికి సమీపంలో, మేడిగడ్డ ఎత్తిపోతల పథకానికి కేవలం 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న సోమనాథం శివేశ్వరాలయం వద్ద ఈ సంగమ దృశ్యం ఆవిష్కృతమైంది.

### మూడు నదుల కలయిక: విశిష్టత

సాధారణంగా నదులు కలిసే చోట ఆధ్యాత్మిక శక్తి మెండుగా ఉంటుందని మన పురాణాలు చెబుతాయి. ఈ శివేశ్వరాలయం వద్ద గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి.. ఈ మూడు ప్రధాన నదులు ఒకేచోట కలవడం అత్యంత అరుదైన విషయం. స్థానికులు ఇక్కడ వెలసిన శివుడిని ఎప్పటి నుంచో పూజిస్తున్నప్పటికీ, తాము నిత్యం చూస్తున్నది పుణ్యప్రదమైన 'త్రివేణి సంగమం' అని వారికి తెలియదు. చరిత్రకారుల పరిశీలన తర్వాతే ఈ ప్రాంత ప్రాముఖ్యత ప్రపంచానికి తెలిసింది.

### ప్రకృతి ఒడిలో పరమశివుడు

ఈ ప్రాంతం ప్రకృతి రమణీయతకు నిలయం. ఎంతటి కరువు కాలంలోనైనా ఇక్కడ నీటి ప్రవాహం ఆగకపోవడం గమనార్హం. ఎప్పుడూ నీటితో కళకళలాడుతూ, పచ్చని చెట్ల మధ్య ఉండే ఈ ప్రాంతంలో శివుడు కొలువై ఉండటం వెనుక లోతైన చారిత్రక కారణాలు ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రాచీన కాలంలో ఋషులు, మునులు ఇక్కడి ప్రశాంతతకు ముగ్ధులై తపస్సు ఆచరించి ఉండవచ్చని, అందుకే ఇక్కడ శివాలయం వెలిసిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

### అభివృద్ధి వైపు అడుగులు పడాలి

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రూపురేఖలను మార్చివేసింది. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన ఈ రెండో త్రివేణి సంగమాన్ని, శివేశ్వరాలయాన్ని గనుక అభివృద్ధి చేస్తేభక్తులకు మరో పవిత్ర పుణ్యక్షేత్రం అందుబాటులోకి వస్తుంది.ఈ ప్రాంతంలో ఇంకా లోతైన తవ్వకాలు లేదా పరిశోధనలు జరిపితే మరెన్నో చారిత్రక సత్యాలు బయటపడే అవకాశం ఉంది. పర్యాటకం పెరగడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

కాళేశ్వరం ముక్తి క్షేత్రమైతే, సోమనాథం శివేశ్వరాలయం ప్రకృతి సిద్ధమైన ఆధ్యాత్మిక అద్భుతం. మూడు నదుల సంగమ క్షేత్రంగా దీనిని గుర్తించి, ప్రచారంలోకి తీసుకురావడం ద్వారా తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక మణిహారంగా మారుతుంది. ఈ క్షేత్ర వైభవం గురించి మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కల్తీ పై నియంత్రణ లేదు.. ఆరోగ్యాలకు భద్రత లేదు .!



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.మనిషి ఆరోగ్యంగా ఉండగలిగినపుడే శ్రమతో స్వేదం చిందించి సంపదను సృష్టించగలుగుతాడు.అలా సృష్టించిన సంపదనే కుటుంబం మరియు సమాజ అవసరాలకు, శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. ఆ సంపద సృష్టించే మనిషే అనారోగ్యానికి గురై తే చికిత్సల కోసం అవస్థలు పడుతుంటే ఆర్థిక ఎదుగుదల గానీ ఇతరత్ర అభివృద్ధి గానీ జరగక పోగా కుంటుపడుతుంది. మనుషులు బతకడానికి అవసరమైన పీల్చే గాలి ,తాగే నీరు, తినే ఆహారం సర్వం కల్తీ మయమైన పరిస్థితి సమాజంలో నెలకొనివుంది . ప్రజారోగ్యానికి దోహదం చేసే ప్రకృతి వనరులు కాలుష్యానికి గురి కావడం,మనుషులు నిత్యజీవితంలో ఉపయోగించే ఆహార పదార్థాలు రకరకాలుగా కల్తీ కావడం వలన ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కట్టడి చేయాల్సిన కల్తీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తున్న వైనంపై అరికట్టే చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

మనుషులు తమ తమ పనుల ఒత్తిడుల వల్ల బయట ఆహారాలపై ఆధారపడటం వలన ఆహారపదార్థాల కల్తీ నిరాటంకంగా కొనసాగుతోంది. ఫలితంగా ఏటా ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ప్రజలను వివిధ రకాల రోగాలకు, అనారోగ్యాలకు కారణమవుతున్న కల్తీ దందాపై ప్రభుత్వాల నియంత్రణ పూర్తి స్థాయిలో లేక మనుషులుగా మనం ఉపయోగించే ప్రతి వస్తువు కల్తీ మయమే :'ఇందు గలదందులేదను సందేహం వలదు'అన్నట్లుప్రజలు తప్పక ఉపయోగిస్తారనుకునే ఏ పదార్థాల్లో నైనా కల్తీ జరుగుతోంది. మనం వాడే నిత్యావసరవస్తువులు,ఆహారపదార్థాలు కల్తీమయమవుతున్నాయి. మార్కెట్లో ఏ వస్తువైనా మంచిది ఇవ్వమంటే నంబర్ వన్నా, నంబర్ టూ అంటూ రెండు మూడు రకాలవి చెబుతున్నారు. ఎక్కువగా ఏ వస్తువు కైతే డిమాండ్ ఉండి ధర ఎక్కువగా ఉంటుందో ఆ వస్తువును అక్రమార్కులు అధికంగా కల్తీ చేస్తున్నారు.

**నూనె** ప్రతి ఇంట్లోచేసే వంటకాల్లో నిత్యావసరంగా తప్పనిసరిగా నూనెలు వాడుతుంటారు.పెళ్ళిళ్ళు వంటి శుభకార్యాలలో ఇంకా ఎక్కువగా ఉపయోగిస్తారు. గతంలో పల్లి నూనె , నువ్వుల నూనె గ్రామాల్లో సైతం గానుగ పట్టించే వారు. ప్రస్తుతం ఫిల్టర్ ఆయిల్ పేరిట,రిఫైండ్, డబుల్ రిఫైండ్ లో పేర్లతో పల్లి నూనె, నువ్వుల నూనె ,పొద్దు తిరుగుడు నూనె ,పామాయిల్ , ఆలివ్ , రైస్ రిచ్ ఆయిల్లాంటివి ఆకర్షణీయమైన ప్యాకెట్ల తో మార్కెట్లో కి వచ్చాయి.చౌకధరల్లో లభించే నూనెలు పల్లి , నువ్వుల నూనెల్లో కలిపి అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అలా చేయందే ఆ ధరలకు ఆ నూనెలు అమ్మడం కుదరదంటున్నారు. మిల్లుల గానీ,గానుగల గానీ పల్లి నూనె పట్టిస్తే ఒక లీటర్ కి 500 రూపాయలు ఖర్చు అవుతుంటే రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 200 రూపాయల లోపే లభిస్తుంది . కల్తీ లేని నాణ్యత గల నూనె ధర ఎక్కువగా ఉండగా , కల్తీమయమైన నూనె చౌకగా దొరుకుతున్నందున తక్కువ ధరకు లభించేదే జనాలు ఉపయోగిస్తారు. బ్లెండెడ్ వెజిటబుల్ ఆయిల్ పేరుతో రెండు రకాల నూనెలను కలిపి అమ్ముతున్నారు. మనుషుల ఆరోగ్యాలపై దుష్ప్రభావాలను ఏర్పరిచే కల్తీ పదార్థాలను నియంత్రించాల్సిన అవసరము ఎంతో ఉంది . పెద్ద పెద్ద హోటళ్ళలో చౌకగా లభించే నాణ్యతలేని నూనెలు ,జంతు కళేబరాలతో చేసిన నూనెలు టిన్నుల్లో తెచ్చి వినియోగిస్తున్నారు.ఇదొకవైపు ఇలా జరగ్గా ఫాస్టుఫుడ్ సెంటర్లు, ఉదయం టిఫిన్ సెంటర్లు, సాయంత్రం మిర్చి,బజ్జీల బండ్లలో ఒక్కసారి వాడాల్సిన నూనెనే మళ్ళీమళ్ళీ మరిగించి వాడటంతో హానికరంగా మారి ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు అంటున్నారు.

### ఆహార పదార్థాల కల్తీ

చిన్న చిన్న హోటళ్ళు మొదలు కొని ధాబాలు,పెద్దపెద్ద రెస్టారెంట్లు , ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో సప్లై చేసే ఆహారపదార్థాలు కల్తీ చేయడం మామూలైపోయింది. కూరల్లో రుచి కొరకు ఫ్లేవర్స్, ఫుడ్ కలర్స్, సాస్ లాంటివి కలుపుతున్నారు. న్యూడుల్, ఫ్రైడ్ రైస్,రుచికరమైన కూరల్లో వెనిగర్ ,మైదా, సింథటిక్ గమ్ ,రెడాక్సైడ్ లాంటివి కలుపుతున్నారని పరీక్షల్లో తేలింది. కాలం చెల్లిన వాటిని రీసైకిలింగ్ చేసి వినియోగిస్తున్నారు.అల్లం,వెల్లుల్లి పేస్టులు కల్తీవే.గతంలో దేశంలో చేసిన సర్వే అధ్యయనంలో కల్తీ దందా చేస్తున్న 19 టాప్ సిటీలో హైదరాబాద్ మొదట్లోనే ఉంది తర్వాత బెంగళూరు చెన్నైలు ఉన్నాయి. దేశంలోనే హైదరాబాద్ ఆహార పదార్థాలు సరఫరా చేసే ఆరవ అతిపెద్ద నగరం . ఇది వేల కోట్ల రూపాయల వ్యాపారం. రాజధాని నగరమే కాక ఆయా జిల్లాల్లోని వరంగల్, కరీంనగర్ ,నిజాంబాద్ ,నల్గొండ ,సూర్యాపేట, ఖమ్మం తదితర పెద్ద పట్టణాలతో పాటు జిల్లా కేంద్రాలు,ఇతర చిన్న చిన్న పట్టణాలు, మండ లం కేంద్రాలు, గ్రామాల్లోని హోటళ్ళు రాష్ట్రం అంతటా ఇదే తంతు . డబ్ల్యు హెచ్వో సర్వేలో ప్రతి ఏటా కల్తీ ఆహారంతో నాలుగు లక్షల 20వేల మంది చనిపోతున్నారని తెలిపింది. కోట్లాది మంది అనారోగ్యాలతో , ఆస్పత్రుల పాలవుతున్నారు..

ఫుడ్ సేఫ్టీ అధికారులు హైదరాబాదులో గతంలో చేసిన తనిఖీ ల్లో 62 శాతం హోటళ్ళలో పాడైన,కల్తీ చేసిన ఆహారాన్ని సరఫరా చేస్తున్నట్లు తేల్చారు.వేరే రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు ధరకు వచ్చే వేస్ట్ చికెన్ రెస్టారెంట్లో అందిస్తున్నట్లు తేలింది. కుళ్ళిన పదార్థాలు వాసన రాకుండా రసాయనాలు, ఫ్లేవర్స్, ఫుడ్కలర్స్ కలుపుతున్నట్లు తేలింది. స్వీట్లు ,కేకులు ప్రమాదకర రసాయనాలు కలిపి ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయడం వల్ల అనేకసార్లు బిర్యాని ,సాంబార్ లాంటి ఆహార పదార్థాల్లో పురుగులు రావడం జరుగుతూనే ఉంది. నిత్యం కూరల్లో వాడే పసుపులో మిఠాయి రంగు లేదా క్రోమేట్ కలిపి కల్తీ చేయటం వలన రక్తహీనత,అంధత్వం లాంటి ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.

### పప్పులు మనం

పిండి పదార్థాలకు ,వంటలకు ఉపయోగించే పప్పు దినుసులు నిగనిగా మెరిసి కళ్లకు మంచిగా కనపడేందుకు మిఠాయిలకు వాడే రంగులను,టాల్కం పౌడరు కలపడం వల్ల నాణ్యమైనదిగా భావించి వినియోగదారులు కొంటున్నారు. 'ఫ్రూట్ జ్యూస్ ' పాడైన పండ్లను కలుషిత నీటితో తయారైన ఐస్ను వినియోగగిస్తున్నారు. చిన్నపిల్లల నుండి పెద్దల వరకు ఉపయోగించే పండ్లను పక్వానికి రాకముందే కాయలను తెంపి మగ్గ పెట్టడానికి రసాయనాలను ఉపయోగిస్తున్నారు. వాటర్ మిలాన్లు త్వరగా ఫక్వానికి వచ్చి లోపల ఎర్రగా కనిపిందుకు ఇంజెక్షన్లు ఇవ్వటం, ఆపిల్స్,దానిమ్మ ,అరటి,ఆరేంజ్ లాంటి పండ్లు నిగనిగలాడతూ ఆకర్షణీయంగా కనబడటానికి రసాయన ద్రావకాలను కడగటం,లేదా పూయటం చేస్తున్నారు.. మెరుస్తూ కనపడితే బాగున్నాయనుకుని వినియోగదారులు కొంటుంటారు. ఆరోగ్యంగా ఉండాలని పండ్ల ను తిని అనారోగ్యాల బారిన పడుతున్నారు.

" **మిరప్పొడి.** "స్వీట్ల లోతప్ప అన్ని రకాల కూరల్లో ,చట్నీలలో, ఉప్పు కారం తప్పనిసరిగా ఉపయోగిస్తారు . నాసిరకం ఎండుమిర్చి మరపట్టి కారంపొడి ఎర్రగా ,ఆకర్షణీయంగా కనిపించేందుకు కొన్ని రంగులను కలుపుతున్నారు. ఇటుక పొడి రంపపు పొట్టు, కొన్ని రంగులను కలిపి తయారుచేస్తున్నారు. ఆకర్షణీయ ప్యాకుల్లో విక్రయిస్తున్నారు.రెడీమేడ్ గా దొరికే వీటిని ఉపయోగించడం తో ఇతర అన్ని రకాల పొడులు ఇలానే కల్తీ చేస్తూరెడీమేడ్ ప్యాకుల్లో విక్రయించడం జరుగుతుంది..

### కల్తీ విత్తనాలు, ఆహారం..ప్రజారోగ్యానికి ముప్పు

దేశానికి అన్నం పెట్టే రైతులే ఈరోజు కల్తీ విత్తనాలు, నకిలీ మందుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. అధిక దిగుబడి వస్తుందనే నమ్మకంతో ఖరీదైన విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసినా, చివరికి దిగుబడి రాక అప్పుల బారిన పడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. పంటలకు వచ్చిన వ్యాధులకు మందులు పిచికారీ చేసినా అవి కూడా కల్తీగా తేలడంతో రైతుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి ఘటనలు గ్రామాలు, జిల్లాలు దాటి రాష్ట్ర స్థాయిలో పెరుగుతూ రైతుల ఆర్థిక స్థితిని దెబ్బతీస్తున్నాయి.ఇదే పరిస్థితి ఆహారంలో కూడా కనిపిస్తోంది. పాలు వంటి ప్రాథమిక ఆహార పదార్థాల్లో సైతం కల్తీ పెరిగింది. హాని కర రసాయనాలు, యూరియా, కార్బైడ్ వంటి పదార్థాలతో పాలు తయారు చేయడం ఆరోగ్యానికి ప్రమాదకరం. అలాగే హోటళ్లలో అందించే ఆహారం కూడా నాణ్యతలేమితో ఉండడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో "హోటల్ టు హాస్పిటల్" పరిస్థితి ఏర్పడుతోంది.

కల్తీ ఆహారం వల్ల జీర్ణ సమస్యలు, మధుమేహం, రక్తపోటు, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంట్లోనే నాణ్యమైన ఆహారం తీసుకోవడం మంచిది.అయితే, ఇది పూర్తిస్థాయి పరిష్కారం కాదు. ప్రభు త్వం కూడా కల్తీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు, మందులు, కల్తీ ఆహారంపై కఠిన చట్టాలు అమలు చేసి బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలి. అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తేనే ప్రజారోగ్యానికి భద్రత కలుగుతుంది.



— నర్రా భగవాన్ రెడ్డి
రచయిత
9492913165

# వరాల జల్లు.. వాస్తవాల ముల్లు!

## — పథకాల జాతరలో రైతు ఆకలి కేకలు



భారతదేశం 'అన్నదాత సుఖీభవ' అని పైకి నినదిస్తున్నా, లోలోపల అదే అన్నదాతను అప్పుల ఊబిలోకి తొక్కి మసిచేస్తోంది. పాలకుల ప్రసంగాల్లో రైతు ఆకాశమంత ఎత్తున కనిపిస్తాడు కానీ, ఆచరణలో మాత్రం ఆ మట్టి మనిషి బతుకు పాతాళంలో కునారిల్లుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం పీఎం కిసాన్, పంట బీమా అంటూ ప్రకటిస్తున్న పథకాల జాతరంతా ఒక రంగుల వెల్లువలా కనిపిస్తున్నా, దాని వెనుక ఉన్నది పచ్చి దగా మరియు వ్యవస్థాగతమైన వెన్నుపోటు.అర్ధరాత్రి వరకు చెమటోడ్చి దేశానికి బుక్కెడు బువ్వ పెట్టే రైతు కళ్లలో కన్నీరు సుడిగుండాలవుతుంటే, ఏసీ గదుల్లో కూర్చుని అంకెల గారడీ చేసే పాలకులకు ఆ ఆక్రందనలు వినిపించడం లేదు. ప్రభుత్వాలు కురిపిస్తున్న వరాల జల్లు కేవలం ఎన్నికల గండం గట్టెక్కే ఎత్తుగడలే తప్ప, రైతు బతుకుల్లోని వాస్తవాల ముళ్లను ఏమాత్రం తొలగించలేకపోతున్నాయి. ఇది నవ భారత ప్రగతి కాదు, నమ్మిన అన్నదాతను నిలువునా నట్టేట ముంచుతున్న నైతిక పతనం.

### పెట్టుబడి సాయం.. పెరిగిన ఖర్చుల ముందు కంటి తుడుపేనా?

ప్రభుత్వం ఏటా రైతు ఖాతాలో వేసే ఆరు వేల రూపాయలు పెట్టుబడికి కొండంత ఆసరా అని ఘనంగా డప్పు కొట్టుకుంటోంది. కానీ, నేడు విత్తనాల నుంచి పురుగు మందుల వరకు ప్రతిదీ భారమైపోయింది. ఒక ఎకరా సాగుకే వేలల్లో ఖర్చవుతున్న ఈ రోజుల్లో, ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే ఈ పిసరంత మొత్తం ఏ మూలకు సరిపోతుందని రైతు నిలదీస్తున్నాడు.ఇది పెట్టుబడి సాయం కాదు, రైతు ఆత్మగౌరవాన్ని తక్కువ చేసే కంటి తుడుపు చర్య. రైతుకు కావాల్సింది ప్రభుత్వాల నుంచి పొందే బిక్షం కాదు, తను పండించిన ప్రతి గింజకూ దక్కాల్సిన న్యాయమైన మద్దతు ధర. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగినప్పుడు, ఆదాయాన్ని పెంచే మార్గం చూపకుండా ఇలాంటి నామమాత్రపు పథకాలతో మోసం చేయడం పాలకుల అసమర్థతకు పరాకాష్ట.

### బీమా ధీమా.. కంపెనీలకే కాసుల వర్షం

పంటల బీమా పథకం అనేది రైతుకు భరోసా ఇవ్వాల్సింది పోయి, బడా కార్పొరేట్ కంపెనీల జేబులు నింపే సాధనంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నీట మునిగినప్పుడు, పరిహారం కోసం రైతు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన దుస్థితి నేటికీ కొనసాగుతోంది. గాలివానలకో, తెగుళ్లకో పంట నాశనమైతే 'సాంకేతిక కారణాలు' నెపం చూపి బీమా కంపెనీలు మొండిచేయి చూపుతున్నాయి.రైతు నుంచి ప్రీమియం వసూలు చేయడంలో ఉన్న వేగం, అతనికి ఆపదలో సాయం చేయడంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించాలి. వాస్తవానికి ఈ పథకాల వల్ల రైతుకు కలిగే ప్రయోజనం కంటే బీమా కంపెనీలు గడిస్తున్న లాభాలే కోట్లలో ఉంటున్నాయి. ఇది భరోసా ఇచ్చే పథకం కాదు, రైతు కష్టాన్ని కంపెనీలకు ధారాదత్తం చేసే వ్యవస్థ.

### మట్టి పరీక్షల ముసుగులో నిర్లక్ష్యం

మట్టిని పరీక్షించి ఏ పంటలు వేయాలో సూచిస్తామన్న పథకం వినడానికి అద్భుతంగా ఉన్నా, క్షేత్రస్థాయిలో అపహాస్యమవుతోంది. ఆ పరీక్షల నివేదికలు చేతికి వచ్చేసరికి సాగు కాలమే ముగిసిపోతోంది. పరీక్షించిన మట్టికి ఏయే పోషకాలు అవసరమో తెలిసినా, అవి మార్కెట్లో దొరకవు, దొరికినా సామాన్యుడు కొనలేని ధరల్లో ఉంటాయి.కేవలం కార్డులు పంపిణీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు, ఆ సూచనల ప్రకారం అవసరమైన ఎరువులను ప్రభుత్వం రాయితీపై అందించాలి. భూమి సారం కోల్పోకుండా ఉండాలన్న లక్ష్యం కన్నా, కేవలం పథకం పేరుతో ప్రకటనలు ఇచ్చుకోవడానికే పాలకులు ప్రాధాన్యత ఇస్తున్నారు.

### రుణాల ఉచ్చులో క్రెడిట్ కార్డులు

రుణాలు ఇస్తున్నాం కదా అని గొప్పలు చెప్పుకునే పథకాలు రైతును మరింత అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. బ్యాంకు అధికారులు పెట్టే నిబంధనలు, అడిగే పత్రాలు చూసి సగటు రైతు బెంబేలెత్తిపోతున్నాడు. సకాలంలో రుణం అందక, గ్రామాల్లోని వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసి, ఆపై బ్యాంకు రుణాలు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతల గాథలు దేశవ్యాప్తంగా విన్పిస్తూనే ఉన్నాయి.రుణం ఇవ్వడం అంటే సమస్యకు పరిష్కారం కాదు, ఆ రుణాన్ని తీర్చే ఆర్థిక శక్తిని రైతుకు కల్పించాలి. పండించిన పంటను అమ్ముకోవడానికి సరైన మార్కె ట్ వ్యవస్థ లేనప్పుడు, ఈ రుణాలు కేవలం భారంగానే మారుతా యి. రైతుల ఆత్మహత్యల రికార్డులే ఈ పథకాల వైఫల్యానికి సాక్ష్యాలు.

### మౌలిక సదుపాయాలు.. ఎవరి కోసం?

లక్షల కోట్ల నిధులను వ్యవసాయ మౌలిక సదుపాయాల కోసం కేటాయించామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, పండించిన కూరగాయలు రోడ్ల పాలు అవుతుంటే, ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతుంటే ఆ గిడ్డంగులు ఎక్కడ ఉన్నాయో తెలియదు. గిడ్డంగుల నిర్మాణం అనేది సామాన్య రైతుకు కాకుండా దళారీలకు, బడా వ్యాపారులకు నిల్వ కేంద్రాలుగా మారుతోంది.గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను దాచుకునే ఆర్థిక స్థోమత రైతుకు లేనప్పుడు, ఈ మౌలిక సదుపాయాల నిధి అంకెలు కేవలం ఆడంబరాలుగానే మిగిలిపోతాయి. ధనికుల జేబులు నింపే ఈ విధానాలు పేద రైతుకు ఏ విధంగా మేలు చేస్తాయో పాలకులు సమాధానం చెప్పాలి.

### రైతుకు 'బిక్షం'..మార్పు ఎప్పుడు?

ప్రభుత్వ పథకాలు రైతుకు 'బిక్షం' లాగా కాకుండా, అతని 'హక్కు' లాగా అందాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చినప్పుడే రైతుకు అసలైన విముక్తి లభిస్తుంది. కేవలం నిధుల కేటాయింపులు చూపి ప్రగతి అని భ్రమపడటం మానేయాలి. ప్రతి గ్రామంలో రైతు పడుతున్న కష్టాన్ని, కన్నీటిని తుడువగలిగే రోజున మాత్రమే ఈ పథకాలకు సార్థకత చేకూరుతుంది. అన్నదాత అప్పులపాలైతే అది కేవలం ఒక కుటుంబం సమస్య కాదు, అది దేశ ఆహార భద్రతకే ముప్పు. పాలకులారా.. నినాదాల హోరు తగ్గించండి, రైతు బతుకుల్లో నిజమైన వెలుగు నింపండి. పథకాల జాతర పక్కన పెట్టి, రైతు గుండెల్లో నిండిన వేదనను తీర్చే దిశగా అడుగులు వేయండి.



- వెంక గారి
భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

**వ్యవసాయంలో టాప్ 3 దేశం**



భారతదేశం (India)

రైతులపై ఆధారపడే ఉన్న ప్రధాన ఆర్థిక రంగం వ్యవసాయం. బియ్యం, గోధుమ, పత్తి, పాలు ఉత్పత్తిలో ముందుంది.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ముద్ర, కూకట్‌పల్లి :**

స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్లు కేవలం కాలనీకే పరిమితం కాకుండా, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. బాలనగర్ డివిజన్ పరిధిలోని డి.సంజీవయ్య కాలనీ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్లో బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# ఘనంగా మాధవరం కాంతారావు జన్మదినం

**ముద్ర, కూకట్‌పల్లి :**

కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ మాధవరం కాంతారావు జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని కాంతారావును శాలువాతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంతారావు నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంతారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# తాటిపాముల తండాకు ఎమ్మెల్యే వరాలు

**ముద్ర, పెబ్బేరు :**

వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామానికి అనుబంధంగా ఉన్న తండాలో భాగ్యమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం హాజరయ్యారు. తొలిసారిగా తండాకు వచ్చిన ఎమ్మెల్యేకు తండావాసులు డప్పు వాయిద్యాలతో, సాంప్రదాయ నృత్యాలతో పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం గృహ ప్రవేశంలో పాల్గొని దంపతులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమకు సొంత ఇల్లు లేక అడవి ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇల్లు మంజూరు కాలేదని, అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇల్లు మంజూరై రూ.5లక్షల ఆర్థిక సహాయం అందడంతో కొత్త ఇల్లు నిర్మించుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చుతోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. తండా అభివృద్ధికి అవసరమైన అంశాలను గ్రామస్థులు తన దృష్టికి తీసుకురాగా, ఏడాది లోపల తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భీరం రాజశేఖర్ రెడ్డి, రాములు యాదవ్, వెంకటయ్య, రాజగౌడ్, కురుమూర్తి, పరుశురాం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హాఫీజ్‌పేట్‌లో ఇఫ్తార్ విందు

- **పాల్గొన్న పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని యూత్ కాలనీలో నిర్వహించిన దవాత్‌ఏఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ హాజరయ్యారు. స్థానిక నాయకులు, మత పెద్దల సమక్షంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈసందర్భంగా అరికపూడి గాంధీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం పవిత్రమైనదని, ఈ నెలలో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు సమాజంలో సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన "గంగాజమునా తెహజీబ్" మరింతగా విస్తరించాలని, రంజాన్ పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు మసీదులు, ఈద్గాల అభివృద్ధి, మరమ్మతులకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పండుగ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్తర్, చాంద్ పాషా, మన్సూర్, రాము, అన్వర్, తైసిన్, కాజా, అజార్ తదితరులు, ముస్లిం మత పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# పాలన మరిచి రియల్ ఎస్టేట్ వ్యాపారాలేనా?

- **మూసి ప్రాజెక్ట్ పేరుతో ఇళ్లు కూల్చివేతలకు వ్యతిరేకం**
- **బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన హరీష్ రావు**

**ముద్ర ప్రతినిధి, బండ్లగూడ :**



మూసి అభివృద్ధి పేరుతో ప్రజలను రోడ్డున పడేయాలని ప్రయత్నిస్తే సహించబోమని మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కింద టిప్పు ఖాన్ బ్రిడ్జి సమీపంలోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ రెండు బ్లాకులను కూల్చివేయనున్న నేపథ్యంలో ఆయన ఆదివారం మూసి పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం మధు పార్క్ రిడ్జ్‌లో బాధితులతో సమావేశమై భరోసా కల్పించారు. సుమారు 440 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొన్నదని, ఒక్క ఇల్లు కూడా కూల్చివేయనివ్వమని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన, అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ అర్థంలేని ప్రాజెక్టుల పేరుతో ప్రజలపై భారం మోపడం తగదన్నారు. ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా మరియు ప్రజాస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవిలోకి వచ్చిన తర్వాత ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని, కానీ పలు ఇళ్లను కూల్చివేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రైతుబంధు నిధులు, పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు నిధులు లేవని చెబుతూ, ప్రజాధనాన్ని ఇతర కార్యక్రమాలకు వెచ్చించడం సమంజసం కాదన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందన్న హరీష్‌రావు, కక్షసాధింపు చర్యలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రజాపాలన మరిచి సీఎం రేవంత్ రెడ్డి ఏది చేసిన రియల్ ఎస్టేట్ కోసమే చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో మూసి అభివృద్ధి కోసం వేల కోట్లు ఖర్చు చేశామని, కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చామని గుర్తు చేశారు. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి సాధ్యమని, ముందుగా మూసిలో పూడిక తొలగింపు, లోతు పెంపు, ప్రహరీల నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే జేసీబీల ముందు కూర్చుని నిరసన తెలుపుతామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కృష్ణారావులు మాట్లాడుతూ.. వివిధ రకాలుగా భూములు లాక్కోవడం, ఇల్లు కూల్చడం రంగారెడ్డి జిల్లాలోనే చేస్తున్నారన్నారు. తమ జిల్లా ప్రజలు అంటే అంత చులకనగా ఉందని వారు మండిపడ్డారు. ఇప్పటివరకు కూడా మూసి వరదల లెవెల్ మార్కులు కూడా ఎక్కడ వేయలేదు అన్నారు. ఇటీవల వరదలలో నగరం మునిగిపోయిన మూసీ పక్కన ఉన్న మధు పార్క్ రిడ్జ్ వద్ద తరిదాపుల్లోకి కూడా వరద నీరు రాలేదని గుర్తు చేశారు. బాపు ఘాటు నుంచి ఇక్కడి వరకు చాలా ఖాళీ స్థలం ఉందని, ఉన్న స్థలంలో మీ ప్రాజెక్టులు నిర్మించుకోవాలని సూచించారు. బాధితులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ ఇళ్లను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని, అభివృద్ధి పేరుతో దౌర్జన్యాలు చేస్తే నగర ప్రతిష్ఠ దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీ మేయర్ ప్రేమ్ గౌడ్, దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఏకలవ్య ఫౌండేషన్ వార్షికోత్సవం

- **గురుకుల హాస్టల్ భవనాలకు శంకుస్థాపన**

**ముద్ర, తాండూర్ :**



వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం జినుగుర్తి గ్రామంలో ఉన్న ఏకలవ్య ఫౌండేషన్‌లో ఆదివారం సందీపని వార్షికోత్సవ వేడుకలు, నూతన గురుకుల హాస్టల్ భవనాల శంకుస్థాపనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన జినుగుర్తి గ్రామంలో సువిశాల ప్రాంగణంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ స్థాపన కావడం స్థానికులకు గర్వకారణమన్నారు. ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న విద్యా, సేవా కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. అనతి కాలంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సంస్థ భవిష్యత్తులో సమాజానికి ప్రతిభావంతులైన విద్యార్థులను అందిస్తుందని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందరికీ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సమగ్ర నివాస పాఠశాలలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. తాండూర్ ప్రాంతంలో విద్యా సదుపాయాలు విస్తరిస్తుండటం ఆనందకరమని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు, ఏకలవ్య ఫౌండేషన్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కూకట్‌పల్లిలో విషాదం..

- **రోడ్డుపై వ్యక్తి ఆకస్మిక మృతి**


**ముద్ర, కూకట్‌పల్లి :**

స్థానిక శ్రీ సాయిరాం గోల్డ్ షాపు సమీపంలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతిచెందిన వ్యక్తిని ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన కొమ్మినేని నరసింహారావు చౌదరి(48)గా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. నరసింహారావు గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. 2011లో కార్యాలయంలోనే ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆరోగ్యం దెబ్బతింది. ఆ తర్వాత భార్య విడాకులు తీసుకోవడంతో మానసికంగా కుంగిపోయిన ఆయన మద్యానికి బానిసయ్యారు. కూకట్‌పల్లిలో ఒంటరిగా ఉంటూ రోడ్ల పక్కన కాలం గడిపేవారు. శనివారం అర్ధరాత్రి మద్యం మత్తులో గోల్డ్ షాప్ ముందు పడుకున్న నరసింహారావు, ఆదివారం ఉదయం 8:30గంటల ప్రాంతంలో రోడ్డుపైకి వచ్చి కూర్చున్నారు. ఆ సమయంలో అకస్మాత్తుగా వెనక్కి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. కొమ్మినేని నరసింహారావు బంధువుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎఐ సమ్మిట్ అడ్డుకోవడం దేశ ప్రతిష్ఠకు భంగం

- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**



దేశ రాజధానిలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఎఐ సమ్మిట్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్ రెడ్డి విమర్శించారు. ఈ చర్య వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎఐ సాంకేతికత ప్రాధాన్యాన్ని గుర్తించి ఈ రంగంలో విప్లవాత్మక అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఈ సమ్మిట్‌కు 100కు పైగా దేశాల ప్రతినిధులు, ప్రధానులు, ఎఐ రంగ నిపుణులు హాజరయ్యారని పేర్కొన్నారు. భారత్ సాధించిన ఎఐ విజయాలను ఈ వేదికపై ప్రదర్శించారని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం పలుభాషల్లో తక్షణ అనువాదంతో వినిపించడమే ఎఐ సాంకేతికత ప్రగతికి నిదర్శనమని అన్నారు. 2047 నాటికి భారత్‌ను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎఐ, సమాచార సాంకేతికత, అంతరిక్ష, వైద్య సాంకేతిక రంగాల్లో కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. అంతర్జాతీయ వేదికైన భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేయడం దేశాన్ని కించపరిచే చర్యగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఇళ్లు, మరుగుదొడ్లు, తాగునీటి కనెక్షన్లు, ఆరోగ్య బీమా కార్డులు, వృద్ధులకు ఉచిత వైద్యం, అసంఘటిత కార్మికులకు పెన్షన్, ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతాలు వంటి పథకాలను అమలు చేస్తున్నదన్నారు. దేశ అభివృద్ధి కోసం పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.



# వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ 243మందిపై కేసులు

**ముద్ర, శేరిలింగంపల్లి :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ట్రాఫిక్ డీసీపీ-I రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో మొత్తం 243మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వీరిలో 189మంది ద్విచక్ర వాహనదారులు, 13 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కారు డ్రైవర్లు, ఒక హెవీ వాహనదారుడు ఉన్నారు. వీరందరినీ కోర్టుకు హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. గత వారంలో 236 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించగా, 9మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, 6మందికి సోషల్ సర్వీస్‌తో జరిమానా, 221మందికి జరిమానా విధించబడినట్లు అధికారులు వివరించారు.

# వైభవంగా ముగిసిన రాష్ట్ర పోలీస్ క్రీడోత్సవాలు

**ముద్ర, శేరిలింగంపల్లి :**



రాష్ట్ర పోలీసు సిబ్బందిలో నూతనోత్సాహం నింపిన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 ఘనంగా ముగిసింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మైదానాల్లో గత కొన్ని రోజులుగా జరిగిన ఈ క్రీడోత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 2,532 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) వైస్ చైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ.సోనిబాలా దేవి హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఆమెతోపాటు ఏడీజీపీ సంజయ్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు. మహిళల టగ్ ఆఫ్ వార్ విభాగంలో మల్కాజిగిరి జట్టు ప్రథమ స్థానం సాధించగా, హైదరాబాద్ జట్టు ద్వితీయ, సైబరాబాద్ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. పురుషుల విభాగంలో టీజీఎస్‌పీI జట్టు విజేతగా నిలిచింది. ఈసందర్భంగా డా.సోనిబాలా దేవి మాట్లాడుతూ.. సమాజ భద్రత కోసం పోలీసులు పడే శ్రమ ప్రశంసనీయమని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం.రమేష్ మాట్లాడుతూ, క్రీడలు పోలీసు శాఖలో ఆరోగ్యం, ఫిట్‌నెస్, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. సుమారు 300 మంది మహిళా క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణమన్నారు. పోలీస్ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ ఎక్స్‌పోకు విశేష స్పందన లభించిందని, సిబ్బంది ఆరోగ్య అవగాహన పెంపుకు ఇది దోహదపడిందన్నారు. ముగింపు వేడుకల్లో నిర్వహించిన రిట్రీట్ సెరిమనీ, గోల్కొండ ఆర్మీ రెజిమెంట్ పైప్ బ్యాండ్ స్వరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సంజయ్ కుమార్ జైన్, ఏడిజీపీ, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ బెటాలియన్లు; డా. గజరావు భూపాల్, ఐజీ (పీ&ఎల్), స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్; సైబరాబాద్ డీసీపీలు కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్.కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి.అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యూ&సీడబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, డీసీపీ ట్రాఫిక్-I రంజన్ రతన్ కుమార్, డీసీపీ ట్రాఫిక్-II ఎస్.శేషాద్రి రెడ్డి, 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23-02-2026
www.mudranews.in | @mudranews



వ్యవసాయంలో టాప్ 5 దేశం

బ్రెజిల్ (Brazil)

సోయాబీన్, చెరకు, కాఫీ ఉత్పత్తిలో ప్రపంచ నేత. విస్తారమైన భూభాగంతో ఎగుమతుల్లో కీలక పాత్ర.




# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేసిన మంత్రి అడ్లూరి**



ముద్ర, ధర్మపురి:

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి మండలం దోనూరు గ్రామంలో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

## తెలంగాణ ఉద్యమకారుల
# సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి

**మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ: గుండేటి ఐలయ్య యాదవ్**

ముద్ర, పెద్దపల్లి:

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ తెలిపారు. పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం మీడియాతో మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారని అన్నారు. ప్రజా కాంగ్రెస్ ప్రభు త్వం, సీఎం రేవంత్ రెడ్డి మీదనే ఉద్యమ కారులు అందరూ ఆశలు పెట్టుకున్నారని వెంటనే ప్రభుత్వం ఉద్యమకారుల గురించి ఆలోచించి వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు అందరికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలాన్ని అందరికీ వర్తింపచేయాలని అన్నారు. కేవలం ఎఫ్ఐఆర్ ఉన్న వాళ్ళకే కాకుండా ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి నష్టపోయిన ఉద్యమకారులను కూడా గుర్తించి అందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని గుండేటి ఐలయ్య యాదవ్ కోరారు

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దుబాటి చంద్రకళ, పొత్తు జ్యోతి రెడ్డి, లలిత ఠాకూర్, రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్, మాడ నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందుల సదాశివ, స్టేట్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు సురేష్ గౌడ్, ఆర్.ఎం.పి పి.ఎం.పి పెద్దపెల్లి జిల్లా విభాగం అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి కందుల అశోక్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలిత ఠాగూర్, జిల్లా ఉపాధ్యక్షులు జునుగురి సుధాకర్, మంద మంద భాస్కర్, కాల్వల తిరుపతి, జిల్లా కార్యదర్శి చంటి నరసక్క, జిల్లా కోశాధికారి ఆలేటి ఎల్లమ్మ, గట్ల రవీందర్ రెడ్డి, ఉద్యమకారుడు మొలుగూరి నరసయ్య, రూపా ఠాగూర్, గడ్డం లక్షి , పెంచల మల్లయ్య, గుజ్జుల పద్మ తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ మేయర్ పదవీ బాధ్యతల స్వీకరణ

**రూ.49 లక్షల అభివృద్ధి పనుల ఫైల్ పై తొలి సంతకం**

**అభినందనలు తెలిపిన కమిసనర్, కార్పొరేటర్లు, సిబ్బంది, బీజేపీ శ్రేణులు**

ముద్ర, కరీంనగర్:

కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ గా కొలగాని శ్రీనివాస్ ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్, కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది మేయర్ ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ తాగునీటి అవసరాల కోసం రూ.49 లక్షల అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైల్ మీద మొదటి సంతకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు చెప్పారు. బిజెపిపై నమ్మకంతో ప్రథమంగా నగరపాలక సంస్థ బాధ్యతలను అప్పజెప్పిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో నగరపాలక సంస్థలోని 66 డివిజన్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, పౌర సేవలు వేగవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థను ఆదర్శవంతంగా, మరింత సుందర నగరంగా తీర్చిదిద్దడానికి ముందుకు సాగుతామని అన్నారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ముద్ర, పెద్దపల్లి:

జూలపల్లి మండలం, తెలుకుంటలో శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం, శివాలయంలో కలశ ప్రతిష్టాపనకార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణా రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఆలయ



కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు

**- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం**
**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

ముద్ర, కరీంనగర్:

కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి కాంగ్రెస్ శ్రేణుల అరాచకానికి నిదర్శనమని, కాంగ్రెస్ నేతలు వీధి రౌడీల్ల ప్రవర్తిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల దాడులు దౌర్జన్యాలు, అరాచకాలు సర్వ సాధారణమైపోయాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ ఆఫీస్ పై కాంగ్రెస్ నేతలు చేసిన దాడిని నిరసిస్తూ, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును అరెస్టు చేయడాన్నీ ఖండిస్తూ బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ పాలనలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే హోంశాఖ అట్టి పెట్టు



కొని శాంతి భద్రతలను పరిరక్షించలేని దారుణ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. శాంతి భద్రతలను పరిరక్షించలేని చేతకాని దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును అక్రమంగా అరెస్టు చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడి చేసిన కాంగ్రెస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, నరసింహ రాజు, కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, బండ రమణ రెడ్డి, సోమిడి వేణు ప్రసాద్, బండారి వేణు, సొగాల కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, తాటి ప్రభావతి, ఎన్నం ప్రకాష్. కోదూరి చంద్ర, బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, లోకేష్ నాయకులు వుగెలే సుధాకర్, దాసరి రమణ రెడ్డి, తణుకు సాయి, కుంట తిరుపతి, జాడి బాల్ రెడ్డి, అడిచేర్ల రాజు, ఉప్పర్పెల్లి శ్రీను, లడ్డూ ముందాడ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మౌలానా అబుల్ కలాం వర్ధంతి

ముద్ర, కరీంనగర్:

మాజీ కేంద్ర విద్యా శాఖ మంత్రి స్వర్గీయ మౌలానా అబుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్ డిసిసి కార్యాలయం తో పాటు నగరంలోని బొమ్మకల్ బైపాస్ అబుల్ కలాం విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని బొమ్మకల్ బైపాస్ ఫ్లైఓవర్ వద్ద నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ, మాజీ యంపిటిసి పాషా ఆధ్వర్యంలో అబుల్ కలాం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్. ఏ.మోసిన్, సొసైటీ మెంబర్ సర్వర్ ఖాన్, డిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్. కె. సిరాజ్ హుస్సేన్,




యం.డి.ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, యం.డి.తాజుద్దీన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనడంతో పాటు స్వాతంత్ర్యం అనంతరం ఏర్పాటైన ప్రభుత్వంలో రెండు పర్యాయాలు విద్యా శాఖ మంత్రిగా పనిచేసి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. నాడు కేవలం 10% ఉన్న నిరక్షరాస్యతను నిర్మూలించి ఈ దేశంలో యు.జి.సి, ఐఐటి ఎయిమ్స్ లాంటి ఎన్నో విద్యాసంస్థలను స్థాపించి దేశాన్ని విద్యారంగం వైపు నడిపించిన మేధావి అని కొనియాడారు.

ఈ కార్యక్రమాలలో సయ్యద్ ఖమ్రొద్దీన్, అక్రమ్, నిహాల్ అహ్మద్, లయిక్, సలీమొద్దీన్, ఇక్రమ్, ఖాజా ఖాన్, ఆరీఫ్ ఖాన్, బషీర్, అబ్దుల్ భారీ, సలీం, అబ్దుల్ కరీం, అజ్మత్, జమీల్, శ్రీరాముల రమేష్, శివ ప్రసాద్, జీడి. రమేష్, అజీమ్, వంగల విద్యాసాగర్, కుంభాల రాజ్ కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

# కనీస సౌకర్యాల కల్పన ఏదీ..?

**- పన్నుల వసూళ్లకు మున్సిపల్ అధికారులు సిద్ధం**
**- నిర్మల్ పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ**



ఇటీవల వర్షాలకు జలమయమైన దివ్యనగర్ కాలనీ (ఫైల్)

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

ప్రతి యేటా మున్సిపల్ అధికారులు ప్రజలనుండి పన్నులు వసూలు చేస్తున్నా ప్రజలకు అవసరమైన కనీస వసతుల కల్పనలో మాత్రం శ్రద్ధ కనబరచటం లేదు. ముక్కు పిండి మరీ పన్నులు వసూలు చేస్తున్నారే తప్ప కల్పించాల్సిన సౌకర్యాల గురించి మాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించటం లేదు. ప్రతి ఏటా మార్చి నెల వస్తోందంటే చాలు మున్సిపల్ సిబ్బంది పన్నుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. చిర కాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారం లో మాత్రం ఏ మాత్రం దృష్టి సారించడం లేదు.

### అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ

పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దశాబ్దాలుగా ఊరిస్తూ వచ్చిన బాక్స్ డ్రైనేజీ ఇంతవరకు కార్య రూపం దాల్చలేదు. వర్షాకాలంలో ప్రధాన రహదారులు సైతం నడుం లోతు నీళ్లలో మునిగిపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పలు కాలనీల్లో ఆరడుగుల నీరు నిలుస్తున్నా తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం వెతకడం లేదు.

### ఆక్రమణకు గురవుతున్న రోడ్లు

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఫుట్ పాత్ లకు ఇరువైపులా షెల్టర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఫుట్ పాత్ ల ఆక్రమణ తగ్గిపోతుందని భావించారు. ఐతే షెల్టర్లనే వ్యాపార సంస్థలుగా మార్చుకుని వ్యాపారాలను సాగిస్తున్నా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. విచిత్రం ఏమిటంటే ఫుట్ పాత్ పై ఏర్పాటు చేసిన దుకాణాలకు కూడా విద్యుత్ అధికారులు మీటర్లు బిగించి కనెక్షన్లు ఇస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నా మున్సిపల్ శాఖ పట్టించుకోవడం లేదు. ఆక్రమణ దారులను బెదిరించి మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నిధులు ఎక్కడికి పోయినట్లు?

ప్రతి ఏటా దాదాపు 80 శాతం మేర పన్నులను వసూలు చేస్తున్నా మున్సిపల్ కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించటం లేదు. ప్రతి ఏటా కార్మికులు తమ వేతనాల కోసం సమ్మె చేయటం, జిల్లా అధికారులు వారికి నచ్చచెప్పి విధుల్లో చేరేలా చూడటం పరిపాటిగా మారింది. వసూలైన పన్నుల డబ్బులు ఎక్కడికి వెళుతున్నాయో తెలియడం లేదు. గతంలో కోతుల బెడద నివారించేందుకు నిధులు వెచ్చించారు. ఐతే నేటికి కూడా కోతులు స్వైర విహారం చేస్తున్నా యి. కోతులను పట్టుకునేందుకు వెచ్చిం చిన నిధులు ఏమయ్యాయో తెలియని స్థితి నెలకొంది.

### కొత్త పాలక వర్గంపై ఆశలెన్నో...

గత పాలకవర్గాలు పట్టణంలో నెలకొన్న సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పాలక వర్గం అయినా ఈ సమస్యలపై చర్యలు తీసుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు.



## బీజేఎల్పీ నేత ఏలేటి గృహ నిర్బంధం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కామారెడ్డి పర్యటనకు ముందు హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఒక శాసన సభ్యునిగా, బీజేఎల్పీ నేతగా తనకు పర్యటించే అధికారం ఉందని, తనను గృహ నిర్బంధం చేయటం ఏమిటని ఏలేటి మహేశ్వర్ రెడ్డి వారిని ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అరెస్టు చేయటం చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంత అభద్రతా భావంతో ఉందో బహిర్గతం అవుతుందని ఆయన అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోలేరని, ప్రశ్నించే గొంతుకను చూసి ఎందుకు ఇంత భయమని ఆగ్రహం వ్యక్తం చేశారు



## నేటి నుంచి ప్రజావాణి యథాతథం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తిరిగి ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులు సమర్పించదలిచిన వారు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై నేరుగా అధికారులకు తమ దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు. జిల్లావాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రారంభమైన రెండో విడత అలైవ్ అరైవ్

**- ఎస్పీ జానకి షర్మిల**

ముద్ర ప్రతినిధి, నిర్మల్:



ప్రజల ప్రాణాల రక్షణే ధ్యేయంగా రెండో విడత అలైవ్ అరైవ్ కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఎస్పీ మాట్లాడుతూ డీజీపీ శివధర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వారం రోజుల పాటు అన్ని పోలీసు స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన, సురక్షిత ప్రయాణంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. 23న లేన్ డిసిప్లిన్ డ్రైవ్ లో తప్పుడు ఓవర్‌టేకింగ్ తనిఖీ, ఎడమ లేన్ డ్రైవింగ్ అమలు చేయడం, 24న హెల్మెట్ హెల్మెట్ తనిఖీ డ్రైవ్‌లు, పాఠశాలలు, మార్కెట్ల వద్ద అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. 25 న జిల్లా లోని ప్రధాన కూడళ్లలో నాలుగు చక్రాల వాహనాల తనిఖీలు జరిపి సీట్ బెల్ట్ వినియోగంపై వివరించనున్నామన్నారు.

26న డ్రంకెన్ డ్రైవ్ పై, 27న భారీ వాహన డ్రైవర్లకు శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. 28న కార్యక్రమం ముగుస్తుందని ఎస్పీ వివరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



వ్యవసాయంలో టాప్ 6 దేశం

రష్యా (Russia)



గోధుమ ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రస్థానాల్లో ఒకటి. చల్లని వాతావరణంలో కూడా పెద్ద ఎత్తున సాగు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ముద్ర, అడ్డగూడూరు :**

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 201011 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 15 సంవత్సరాల తర్వాత స్నేహితులందరూ ఒక్క దగ్గర కలవడంతో తమ ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



## ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రజల సహకారంతోనే సమస్యలను పరిష్కరించగలమని భువనగిరి మున్సిపాలిటీ 12 వార్డు కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి అన్నారు. భువనగిరి పట్టణం లోని 12 వార్డ్ లో పగిడిపల్లిలో గత 15 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రోడ్డును కడమంచి రాములు ఇంటి దగ్గర ఆగిన రోడ్ పనులకు సహకరించాలని వారి కుటుంబ సభ్యులతో కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి వెంకటేష్, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ తోటకూరి విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ వార్డులోని సమస్యలను శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



## కరాటే పోటీల్లో ప్రతిభ

**ముద్ర, ఖమ్మం:**

తెలంగాణ ఇంటర్ స్కూల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఖానాపురం యూపీహెచ్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని షాదీ ఖానాలో నిర్వహించిన ఈ పోటీల్లో ఖానాపురం బాలాజీ నగర్ యూపీహెచ్ పాఠశాల విద్యార్థినులు ఎం.స్వాతికి బ్లాక్ బెల్ట్ విభాగంలో బంగారు పతకం, ఎం. విష్ణువందినికి వెండి పతకం లభించింది. విద్యార్థినులను కరాటే మాస్టర్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం చింతల యువసేన, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం రాయగిరిలోని సహృదయ అనాధ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వలపు విజయ్, దండబోయిన బలరాజ్ యాదవ్, గాజుల నవీన్, పల్లెపాటి రవికుమార్, ఎలిమినేటి మహేంద్ర రెడ్డి, దోషపాటి హరీష్, కూదే శ్రీశైలం, మోతే మనోహర్, నాగారం నరేష్, చింతల యువసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



# ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ముద్ర, ఖమ్మం:**



ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ కి నూతనంగా చైర్ పర్సన్ గా ఎంపికైన అనిత, వైస్ చైర్మన్ నవీన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లకు అభినందనలు తెలిపారు. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాత్రమే దృష్టి సారించాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ చాలా విశాలంగా ఉంటుందని, ఇక్కడ ఓపెన్ ప్లేస్ చాలా ఉన్నదని, అనేక మౌళిక వసతుల కల్పన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా ఏదులాపురంను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి కౌన్సిలర్ రోజు ఉదయం వార్డు పరిధిలో పర్యటిస్తూ జరిగే పారిశుద్ధ్య పనులను, అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రతి పని డబ్బుతోనే జరగదని మన పని తీరు ఆధారంగా అనేక మంచి కార్యక్రమాలు అమలు చేయవచ్చని తెలిపారు. వారానికి కనీసం ఐదు రోజులు రెండు గంటల పాటు వార్డులో సమయం గడపాలని అన్నారు. 15 రోజులలో మరొక సమావేశం నిర్వహించి విడతల వారీగా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలి అనే అంశంపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు.మున్సిపాలిటీలో క్షేత్రస్థాయి పర్యటనలు ఓపెన్ ప్లాట్లలో నీరు నిలవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడడం గమనించామని, నాలాల ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా జీవితంలో మనకు వచ్చిన అవకాశాన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ మునవర్ అలీ, మునిసిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పథకాల పేరుతో మోసం

- **సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మొహమ్మద్ సలాం**

**ముద్ర, ఖమ్మం:**



పథకాల పేరుతో ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుంచి మోసం చేస్తోంది అని, ఇది సరైంది కాదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మొహమ్మద్ సలాం తీవ్రంగా విమర్శించారు. బీ ఆర్ ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉపాధి అవకాశాల పేరుతో దరఖాస్తులు తీసుకోవడం తప్పా చేసిందేమీ లేదని ఆరోపించారు. గతం మూడు సంవత్సరాల నుంచి చేస్తున్న ప్రయత్నాలు కేవలం జిరాక్స్ సెంటర్లకు, మీసేవ కేంద్రాలకు లాభం చేయడం కోసమే ఇలాంటి పథకాలు పెడుతున్నారు ,మైనార్టీలకు మాత్రం ఎటువంటి లాభం జరగట్లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకు ఏ మైనార్టీ కూడా ఉపాధి అవకాశాలు పథకాలు అందలేదు. దాంతోపాటు ఇంకా పథకాలు ఇస్తాం, దరఖాస్తు లు సమర్పించండి అంటున్నారు. కరెంటు స్కూటీ బ్యాటరీ స్కూటీలు ఎంతమందికి ఇస్తారు? అని ప్రశ్నించారు. అదే విధంగా డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇ ళ్ళ పేరుతో .. ప్రతి ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, ఓట్లు దండుకోటం తప్ప ముస్లిం మైనార్టీ వర్గాలకు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చని పాలకులకు , అధికారులకు మోసం చేయడం తప్ప మరో పని ఏమీ ఉండటం లేదని తుయబట్టారు. ప్రజా ప్రభుత్వమంటే ప్రజలకు మేలు చేసేది, అభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడేది అన్నారు. ముస్లిం మైనార్టీలకు ఇలా ఎల్లకాలం మోసం చేయాలని హెచ్చరించారు.

# వైభవంగా శ్రీ వారి నిత్య కళ్యాణం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా జరిపించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించి సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. సాయంత్రం ఆదిమధ్యాంత రహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

# బంజారాల సమస్యలు పరిష్కరించాలి

- **జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు జేఏసీ ఆధ్వర్యంలో వినతి**

**ముద్ర, కొత్తగూడెం:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గూడూరులోని ఆయన నివాస గృహంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజన బంజారాలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని, బంజారాలు ఇష్ట దైవాలుగా కొలిచే 'సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్', శ్రీశ్రీశ్రీ సాతి భవాని' అమ్మవార్లకు జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఆలయాలు లేవన్నారు. జిల్లా కేంద్రంలో 'శ్రీశ్రీశ్రీ సాతి భవాని, సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్' ఆలయాన్ని ఏర్పాటు చేయుటకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. అంతేకాక ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు, అన్ని అనుమతులు ఇప్పించవలసినదిగా విన్నవించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బంజారా గిరిజనుల చరిత్రను తెలియపరిచే విధంగా కళాఖండాలు ఏర్పాటు చేయాలని, బంజార సంస్కృతి సాంప్రదాయాలను భావితరాల వారికి అందించేందుకు జిల్లా కేంద్రంలో బంజారా మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లందు క్రాస్‌రోడ్ వద్ద ప్రధాన రహదారి కూడలిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు జాటోత్ ఠాను నాయక్ విగ్రహాన్ని మార్చి 20న ఆయన వర్ధంతి సమయానికి ఏర్పాటు చేసి అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో జివో నెం.3 ని పునరుద్ధరించి స్థానిక గిరిజనులతోనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్యూలు ఏరియా ప్రాంతంలో 1/70 యాక్ట్, పిసా చట్టం, ఎల్‌టిఆర్ చట్టాలను పకడ్బంధీగా అమలు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హుస్సేన్ నాయక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి గుగులోత్ కేశవ్ నాయక్, కో కన్వీనర్లు గుగులోత్ బద్రునాయక్, ధరావత్ కృష్ణనాయక్, జాటోత్ భరత్, లావుడ్య హనుమంతు, ఖమ్మం జిల్లా మంచుకొండకు చెందిన రైతులు లింగ, మంగ్య, భీముడు, రాజు, హనుమ, చందా కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి పట్టణంలోని 28 వార్డులో వినూత్న హాస్పిటల్ నుండి కేజేఆర్ టాకీస్ కి వెళ్లే రోడ్డు గుంతలు పడి వాహనదారులు తీవ్ర పందులు ఎదుర్కొంటున్నారు. తక్షణ పరిష్కారంగా కౌన్సిలర్ సూదగాని సరిత రాజు తమ సొంత నిధులతో రోడ్ ను రిపేర్ చేశారు. మీనానగర్ లో ఉన్న ప్రతి ఒక్క సమస్యని దగ్గరుండి పరిశీలించి పరిష్కరిస్తా అని ఈ సందర్భంగా కౌన్సిలర్ సరిత రాజు హామీ ఇచ్చారు.



## నేడు బాధ్యతల స్వీకరణ

**ముద్ర, మోత్కూర్:**

నూతనంగా ఎన్నికైన మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. సోమవారం జరిగే కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ హాజరు కానున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇండియాలో
టాప్ 10 హీరోలు



రామ్ చరణ్
'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. యాక్షన్, డ్యాన్స్‌లో సమానంగా రాణిస్తున్నాడు.



## ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

**ముద్ర హైదరాబాద్:**

నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక హోమాలు, యజ్ఞాలు, పూజా కార్యక్రమాలు, మంగళ వాయిద్యాలతో శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి ఉత్సవాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్, రమేష్ గౌడ్, మహేష్ గౌడ్, పరుశురాం గౌడ్, శ్రీనివాస్ గౌడ, గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



పూర్తికాని మిని ట్యాంక్ బండ్ నిర్మాణం



ప్రారంభించి వదిలేసిన బోటు



అర్ధంతరంగా ఆగిన శ్మశాన వాటిక



ఫిల్లర్లకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

# కొత్త పాలకవర్గంపై కోటి ఆశలు!

- **అసంపూర్తి పనులు పూర్తయ్యేనా?**
- **పట్టణ సుందరీకరణ జరిగేనా**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఘన చరిత్ర గల మెదక్ పట్టణం ఒకప్పుడు రాచవీడుగా పేరొందింది. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారుతున్నా పట్టణ ముఖం చిత్రం మాత్రం మారడం లేదు. తాజాగా బల్దియా కొత్త పాలకవర్గం వచ్చింది. జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో అనేక సమస్యలు నెలకొన్నాయి. అసంపూర్తి పనులు వెక్కిరిస్తున్నాయి. వాటిని పూర్తి చేసి పట్టణ పౌరులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. కొత్త పాలకవర్గంపై పట్టణ ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. పాలకవర్గం ఎంత వరకు దృష్టి సారిస్తుందో వేచి చూడాలి.

**పాలకవర్గం దృష్టి పెట్టాల్సిన అంశాలు..**

జిల్లా కేంద్రం అయినప్పటికీ పట్టణంలో మూడు ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. వీటి అభివృద్ధికి నిధులు కేటాయించినా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. చౌరస్తాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిన పరిస్థితి. వాటిని సుందరీకరించాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో కేవలం మెదక్ పట్టణంలో చిల్డ్రన్స్ పార్క్ ఉండేది. నేడు అది మిషన్ భగీరథ పైలాన్, కార్యాలయాల సముదాయంగా మారింది. సుమారు 70 వేల జనాభా ఉన్న పట్టణంలో ఒక్క పార్క్ కూడా లేకపోవడం శోచనీయం. రూ.9 కోట్లతో పిట్లం, గోసంద్రం చెరువులను మినీట్యాంక్ బండ్ గా తీర్చిదిద్దే పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వాటిని పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. చారిత్రాత్మక మెదక్ చర్చి, దేశంలో ఎనిమిదోదిగా పేర్కొనే ఖిల్లా వద్ద మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించాల్సిన అవసరం ఉంది. రాందాస్ చౌరస్తా నుంచి చమన్, దాయర రోడ్డు విస్తరణ అవుతుందా కాదో అన్న సందేహంలో నెలకొంది. కొన్ని ఇళ్లు కూల్చినప్పటికి విస్తరణ పనులు జరగడం లేదు. విస్తరించడం వల్ల పట్టణ ప్రజలకే కాకుండా అనేక గ్రామాల వారికి కూడా ఎంతో ఉలయోగకరంగా ఉంటుంది. పట్టణంలోని మిషన్ భగీరథ పైపుల పనుల కోసం అంతర్గత సీసీ రోడ్లను ధ్వంసం చేశారు. వాటి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. కూరగాయల మార్కెట్లో దుకాణాలు లేక రోడ్డుపై విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు బజార్ నిర్మించినా ఇంకా అందుబాటులోకి రాలేదు. సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ఫిల్లర్ల వరకు నిలిచిపోయాయి.పట్టణంలోని వైకుంఠధామాల్లో కనీస వసతులు లేవు. ఇందిరా కాలనీ సమీపంలో నిర్మించిన వైకుంఠ ధామం అసంపూర్తిగా ఉంది. కనీసం అక్కడికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం శోచనీయం. మెదక్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ లేదు. పార్కింగ్ జోన్ లు ఏర్పాటు చేయలేదు. ప్రధానంగా ఎంజీ రోడ్డు, జేఎన్ రోడ్డులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎప్పుడు, ఎక్కడ, ఏ వాహనం వస్తుందో తెలియదు. పట్టణానికి ప్రధానంగా బైపాస్ చాలా ముఖ్యం. 2020లో మెదక్ మున్సిపాలిటీలో విలీనమైన అవుసులపల్లి, ఔరంగబాద్, పిల్లికొట్టాల్లో మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. వీటన్నింటిపై కొత్త పాలకవర్గం దృష్టి సారించాలి. స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, ఎంపీ రఘునందన్ రావులు సహకారం అందించి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని పట్టణంలోని ప్రజలు కోరుతున్నారు.




ప్రారంభానికి నోచుకోని రైతు బజార్



## వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి

**అందోల్, ముద్ర ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుమారుడు అనురాగ్ రెడ్డి వివాహ వేడుకలకు వైద్య. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. ఆదివారం హైదరాబాద్ లోని వట్టి నాగులపల్లిలో ఓ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.




## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**అందోల్, ముద్ర ప్రతినిధి:**

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆందోల్ డివిజన్ ఆర్ బీఐ కౌన్సిలర్ మురళీకృష్ణ సూచించారు. ఆదివారం ఆందోల్ మండలంలోని కొన్యాలలో గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ అకౌంట్ కలిగి ఉన్న ప్రతీ ఒక్కరు కెవైసీ అప్డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు. అపరిచిత నంబర్ నుంచి ఫోన్ కాల్స్ వస్తే ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఇతరులకు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన గురించి అవగాహన కల్పించారు. అకౌంట్ కు సంబంధించి సైబర్ నేరాలపై 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, యువకులు పాల్గొన్నారు.



## పాఠశాల ప్రహరీకి భూమిపూజ

**అందోల్, ముద్ర ప్రతినిధి:**

అందోల్ నియోజకవర్గ పరిధిలోని టేక్మాల్ మండలం సిఎం తండా ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహాకు విన్నవించగా నిధులు మంజూరు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టేక్మాల్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు సుబేదార్ మణి కిషన్, సర్పంచ్ దేవులిబాయి, జోగిపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ దానీబాయి లక్ష్మా, టేక్మాల్ మాజీ సర్పంచ్ ఏ.పాపయ్య, సూరంపల్లి మాజీ సర్పంచ్ బిక్షపతి, సీనియర్ నాయకుడు ఏ.సాగర్, టేక్మాల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సేవాలాల్ హరిచంద్, తారసింగ్, సిఎం తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యమైన ఆహారం అందజేయాలి

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందజేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఆదివారం జిల్లాలోని వెల్దుర్తి కేజీబీవీని సందర్శించారు. హాస్టల్ లోని నిత్యావసర సరుకులు, స్టోర్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, చదువుకు దూరమైన ఎంతోమంది జీవితాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీ నాణ్యమైన వస్తువులను మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన, భోజన సదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయి? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని సూచించారు.

**పీహెచ్ సీలను వినియోగించుకోవాలి..**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. వెల్దుర్తి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రిజిస్టర్లు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతి నెలా ఉచితంగా మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని వారికి తెలియజేయాలన్నారు, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ప్రజలకు కు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

## గోటి తలంబ్రాలలో పాల్గొనండి

- **రామకోటి రామరాజు**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలోని మార్కుక్ మండలం ఎర్రవల్లి హనుమాన్ దేవాలయంలో ఈ నెల 28న నిర్వహించే గోటి తలంబ్రాల కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు కోరారు. ఆదివారం గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరామ నవమి రోజు భద్రాచల సీతారాముల కల్యాణంలో గోటితో ఒలిచిన తలంబ్రాలే వినియోగిస్తారని తెలిపారు. ఈ తలంబ్రాల దీక్ష కార్యక్రమం హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలశాలతో వందలాది భక్తులు పాల్గొంటారని చెప్పారు. నాలుగోసారి మూడు క్వింటాళ్ల గోటి తలంబ్రాల కల్యాణానికి అందించే భాగ్యం కలిగిందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇతర గ్రామాల భక్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రామభక్తులకు ఈ అవకాశం కలుగుజేస్తాన ని చెప్పారు. ఈ కార్యక్రమంలో లింగ బేధం లేకుండా అందరు పాల్గొనాలని కోరారు. మనం లేకున్నా మనం ఒలిచే తలంబ్రాలు కళ్యాణంలో ఉంటే పుణ్యం కలుగుతుందన్నారు. గోటి తలంబ్రాల్లో పాల్గొనడం ఎన్నో జన్మల పుణ్యఫలం అన్నారు. కాగా ఇంతటి అదృష్టాన్ని తమకు కలుగజేస్తున్న రామకోటి రామరాజుకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారన్న గారి కవిత, మహిపాల్ రెడ్డి, రాజిరెడ్డి, పాండరి, నర్సింహారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామస్వామి, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.





## నృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**ముద్ర హైదరాబాద్:**


నిజామాబాద్ జిల్లాలోని బ ధన్ పట్టణం బీటీ నగర్ లోని శ్రీ కోట మైసమ్మ సైత శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోఉత్సవ విగ్రహాలతో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను బోధన్ పట్టణానికి చెందిన ప్రవీణ్ మహారాజ్, నర్సింగ్ పల్లి తిరుమల తిరుపతి దేవాలయం అర్చకులు రోహితా ఆచార్య మంత్రోచ్చారణాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లారం లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కలియుగంలో కొంత సమయాన్ని భగవన్నామస్మరణకు కేటాయించాలని అన్నారు. సనాతన హైందవ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని,.ధర్మం నిలబెట్టేందుకు, తల్లిదండ్రుల మాట, గురువుల మాట వినాలని దైవ నామస్మరణతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. పిల్లలకు ధర్మం గురించి నేర్పాలని, పూర్వీకుల చరిత్రను వినిపించాలని, తల్లితండ్రుల సేవ ఎంతో ముఖ్యమని, దేశ భవిష్యత్ గురించి రుషి సాంప్రదాయం మనదేశంలోనే ఉందని చెప్పారు. చరిత్రలో ప్రతీ గొప్ప వ్యక్తి వెనుక గురువులు వున్నారని, మనం చేసే మంచే మనల్ని కాపాడుతోందన్నారు. సర్వేజనా సుఖినో భవంతు అని కోరేది మన ధర్మమని, బోధన్ పట్టణానికి ఎంతో చరిత్ర ఉందని, దీనికి బహుధాన్య పురం అని పిలిచేవారని, ప్రముఖ ఏక చక్రేశ్వర ఆలయం బోధన్ లోనే ఉందన్నారు. దేవాలయాలు, ధర్మాన్ని కాపాడడం ప్రతీ ఒక్కరి భాధ్యత అని అన్నారు. డబ్బు కోసం వేంపర్లట తో పాటు సమయాన్ని ఆధ్యాత్మిక కు కూడా కేటాయించాలన్నారు. కార్యక్రమాలను ప్రతీ ఏటా ఘనంగా నిర్వహిస్తున్న పసులేటి గోపికిషన్, బృందాన్ని అభినందించారు. కార్యక్రమానికి నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, సత్యా గౌడ్, కొలిపాక బాల్ రాజు, రాజులదేవి, పవన్ కుమార్, గుంత గంగాధర్ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వ్యవసాయంలో టాప్ 8 దేశం**

**ఆస్ట్రేలియా (Australia)**
తక్కువ జనాభాతో భారీ భూభాగంలో సాగు. గోధుమ, గొర్రెల పెంపకంలో ప్రముఖం..



## వైద్య విద్యార్థిని ఆత్మహత్య

- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పరిధిలోని సురభి మెడికల్ కాలేజీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మెడిపెల్లి గ్రామానికి చెందిన శ్రీజ (20) సురభి మెడికల్ కళాశాలలో ఫిజియోతెరపి మొదటి సంవత్సరం చదువుతోంది. కళాశాల హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో తోటి విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అమ్మాయికి తల్లిదండ్రులు లేరు, మేనమామనే ఉన్నత చదువు కోసం సురభి మెడికల్ కాలేజీలో చేర్పించారు. పూర్తి బాధ్యత మెడికల్ కాలేజీ వారిదే అని మృతురాలి బంధువులు ఆరోపించారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు. వ్యక్తిగత కారణాలా? లేక చదువు ఒత్తిడా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థి వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## సొంత జిల్లాకు మోక్షమెప్పుడు..?

- ఆందోళనలో ఎన్నికల బదిలీ తహసీల్దార్లు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

అస్మదీయులైతే ఎక్కడ ఉన్నా అన్నీ అందుతాయి, కానివారైతే అందినవి కూడా జారిపోతాయి అన్న సామెత అక్షరాల రెవెన్యూ శాఖకు వర్తిస్తుంది. ఆ శాఖకు చెందిన పలువురు గెజిటెడ్ ఉద్యోగులను 2023 ఎన్నికల సమయంలో సొంత జిల్లాలో పని చేయరాదన్న నిబంధనలతో పొరుగు జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. రెండేళ్లు పూర్తవుతున్నా సొంత జిల్లాకు బదిలీ చేస్తలేరని పలువురు తహసీల్దార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఎన్నికలకు ముందు తహసీల్దార్లను సొంత జిల్లా అయినా, మూడు సంవత్సరాలు ఒకే జిల్లాలో పనిచేసినా వారిని ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వం 2023 ఆగస్టులో ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. ఎన్నికల అనంతరం తిరుగు బదిలీలు కోరినా సొంత జిల్లా అనే వంకతో బదిలీలు చేయలేదు. అయితే జిల్లా స్థాయి అధికారులు మాత్రం సుమారు ఐదుగురు తహసీల్దార్లను సొంత జిల్లాలో, కలెక్టర్ కార్యాలయంలో పనిచేసేలా ప్రభుత్వ అనుమతితో బదిలీ కాకుండా చూశారు. కాగా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాలకు బదిలీ అయినవారు తిరుగు బదిలీలను చేపట్టాలని, కుటుంబాలకు దూరంగా పనిచేయడం ఇబ్బందిగా ఉందని రెవెన్యూ ఉద్యోగుల సంఘం ట్రెసా ప్రభుత్వాన్ని కోరింది. ఎన్నికలకు ముందు సొంత జిల్లాలో ఉన్నవారు ఇప్పటివరకు అక్కడే పని చేస్తున్నారు. వీళ్లు సొంత జిల్లాలో పని చేస్తే ప్రభుత్వానికి లేని ఇబ్బంది, బదిలీ చేసిన వారు చేస్తే ఎందుకో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు తహసీల్దార్ కేడర్లో పనిచేస్తుండగా ఒకరు తహసీల్దార్‌గా, మరొకరు కలెక్టర్ కార్యాలయ ఏఓగా, ఇంకొకరు డీఆర్డీఏ లో పనిచేస్తున్నారు. మరో నలుగురు సొంత జిల్లాకు సంబంధించిన డిప్యూటీ తహసీల్దార్లు తహసీల్దార్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా తమ ఆవేదన అర్థం చేసుకొని సొంత జిల్లాలకు బదిలీ చేయాలని బాధిత తహసీల్దార్లు కోరుతున్నారు.

## కలసి ఉంటే... కలదు సుఖం...!!

- అందరికీ ఆదర్శంగా ముందుకు ...
- ఉదయం మిత్రమండలి భవిష్యత్ కార్యాచరణ
- త్వరలోనే మళ్ళీ ఫ్యామిలీ టూర్ మీట్



**ముద్ర, హన్మకొండ :**

కలిసికట్టుగా ముందుకు సాగి

రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధికర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే దిశలో మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉదయం మిత్రమండలి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దాసరి కృష్ణారెడ్డి అభిప్రాయ పడ్డారు. ఉదయం మిత్రమండలి ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం బాలసముద్రం లోని ఎ.రామ్మూర్తి నివాసగృహంలో అధ్యక్షులు దాసరి కృష్ణ రెడ్డి అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా కాళేశ్వరం, ఉజ్జయినీ టూర్ ల విజయవంతానికి సహకరించిన వారికి శుభాకాంక్షలు తెలుపడమే కాక.. తొలిసారిగా కుటుంబసభ్యులతో నిర్వహించిన కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందించిన సభ్యులు బి.రామారావు రాణీభాయి, యంఎల్ఎన్ మూర్తి దంపతులతో పాటు స్వల్ప వ్యవధిలో భూపాలపల్లిలో ఆతిథ్యం ఇచ్చిన అక్కడి ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావు కు సమావేశం అభినందనలు తెలిపింది. అలాగే మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినీ ఓంకారేశ్వరుడి సన్నిధిలో పూజలనుంచి మహాకాళేశ్వరుడి దర్శనం వరకు అన్నీ దగ్గరుండి సభ్యులకు చేయూత నిచ్చిన సర్దార్ ఓంకార్ సింగ్ సన్సార్ కౌర్ దంపతులకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. అంతే కాకుండా ఇటీవల అనారోగ్యం బారిన పడిన సభ్యుడు మెండు ఉమామహేశ్వర్ కోలుకోవాలని.. ఆయనకు ఆర్థికంగా చేయూత నివ్వాలని సమావేశం ఆకాంక్షించింది.రాబోయే రోజుల్లో ఉదయం మిత్ర మండలి సభ్యులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని సమావేశం నిర్ణయించింది. కాళేశ్వరం తరహాలోనే పాలకుర్తి సోమేశ్వరుడి తో పాటు శ్రీరామచంద్రుని దర్శనం కోసం సభ్యులంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో మరోసారి వచ్చే నెల మార్చి 15వ తేదీన పాలకుర్తి లో ఫ్యామిలీ మీట్ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

వరంగల్‌లో జరిగిన సమావేశంలో సభ్యులకు అందుబాటులో ధరలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న భూములను మాత్రమే పరిశీలించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న స్థలాలను కూడా అర్హతల మేరకు పరిశీలించిన తర్వాతే ముందుకు సాగాలని తెలిపారు.అలాగే ఉదయం మిత్రమండలి వరంగల్ సంస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. త్వరలో సర్వసభ్య సమావేశం నిర్వహించి, అప్పటి వరకు ప్రస్తుత నిర్ణయాలను సెప్టెంబర్ వరకు అమల్లో ఉంచాలని, కొత్త ప్రతిపాదనలు రెండేళ్ల తర్వాతే అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.మండలి ప్రధాన కార్యదర్శి కన్న పరశురాములు 53 వ వివాహ వేడుకలు ఈ సమావేశంలో ఘనంగా జరిగాయి. అధ్యక్షులు దాసరి కృష్ణారెడ్డి నేతృత్వంలో శాలువా కప్పి కన్నను సభ్యులంతా కేక్ తినిపించి సత్కరించారు.

ఈ సమావేశానికి మండలి ప్రధాన కార్యదర్శి కన్న పరశురాములు, కోశాధికారి అచ్యుత రఘునాథ్, సంయుక్త కార్యదర్శి ముల్లంగి మోహన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పెచ్చెటి వెంకటేశ్వర రావు, అనిశెట్టి రామ్మూర్తి, ఎవి శర్మ, ఎంఎల్ఎన్ మూర్తి, తక్కెళ్ల పల్లి రవీందర్ రావు తదితరులు హాజరయ్యారు.

# సాగునీటిపై రేవంత్ మార్క్ వేగం

- భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్
- జూన్ 2లోపు భూసేకరణకు రూ.600 కోట్లు విడుదల
- మార్చిలో క్యాబినెట్‌లో అన్ని ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్
- దేవాదుల పంప్‌లను నెలలోపే మరమ్మతులు పూర్తి చేయాలి
- అసెంబ్లీ సమయంలో ప్రత్యేక సమావేశంతో సమీక్ష



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రాజెక్టుల పురోగతికి అడ్డంకిగా మారిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**భూసేకరణ కోసం ప్రత్యేక నిధి..**

భూసేకరణ కారణంగా ఏ ఒక్క ప్రాజెక్టు పనులు ఆగడానికి వీల్లేదని సీఎం హెచ్చరించారు. ఇందుకోసం జూన్ 2 లోపల ₹600 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో భూసేకరణ పనులకు నిధుల కొరత లేకుండా ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, పరిహారం చెల్లింపులను గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా రైతులకు అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**దేవాదుల ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి..**

దేవాదుల ఎత్తిపోతల పథకంపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించారు. దేవాదుల పంప్ హౌస్ రిపేర్లను కేవలం నెల రోజుల్లోపు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా దేవాదుల ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కమిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు సాగునీరు అందించే అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

### సీఎంకు అరుదైన ఆహ్వానం

- హార్వర్డ్ నుంచి అందిన లేఖ
- ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించే అవకాశం

**ముద్ర న్యూస్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలిసారిగా నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించాలని నిర్వాహకులు ఆహ్వాన లేఖను పంపించారు. ఈ ఏడాది మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంపస్‌లోనే ఈ కార్యక్రమం జరుగనుంది. భారత్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి ఒక్కరే ఈ సింపోజియం ఆహ్వానం అందుకోవటం విశేషం. ఈ సింపోజియంలో "AI as Infrastructure & Compute Power: Impact on Livability & Workforce" అనే ప్యానెల్‌లో ప్రసంగించాలని సీఎంను ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది.

ఏఐ ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఏఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించాలని సీఎంను ఆహ్వానించారు. ఇటీవల అమెరికా పర్యటనలో నిర్వాహకులు సీఎంను ప్రత్యేకంగా కలిసి సింపోజియంపై చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమియా రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఏఐ పాలన, జియోపాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనేబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలపై చర్చించేందుకు ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**బడ్జెట్ అంచనాలు - క్యాబినెట్ ఆమోదం**

రాబోయే బడ్జెట్‌లో సాగునీటి రంగానికి కేటాయించాల్సిన అంచనాలన్నింటినీ ప్రభుత్వం ముందు ఉంచి ముందస్తు ఆమోదం పొందాలని సీఎం సూచించారు. మార్చిలో ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, అన్ని ప్రాజెక్టుల అంచనాలకు అధికారికంగా ఆమోదం తెలుపుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం లభించనుందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

## ఫ్యాబ్‌సిటీలో ఫార్మా, ఐటీ కంపెనీలు

- రెండేళ్లలో పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు
- ప్రణాళికల రూపకల్పనలో రెవెన్యూ, ఇండస్ట్రియల్ అధికారులు
- ఏడాది క్రితమే 922 ఎకరాలున్నా డీ నోటిఫై చేసిన కేంద్రం
- భారత్ ఫ్యూచర్ సిటీతో ఫ్యాబ్ సిటీ అనుసంధానం





**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ శివారులోని తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో ఫార్మా, ఐటీ సంస్థల ఏర్పాటుకు రెవెన్యూ, పరిశ్రమలశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ మేరకు ఫ్యాబ్ సిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని 922 ఎకరాలను ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం డీనోటిఫై చేసింది. దీంతో రెండు విభాగాల అధికారులు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. రానున్న రెండేళ్లలో ఇక్కడ ఈ పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా , పరోక్షంగా 15 వేల మందికి ఉపాధి లభిస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్ సంస్థలు, ఎలక్ట్రిక్ విభాగాల కంపెనీల ఏర్పాటుకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు మెరుగైన ఉపాధి అవకాశాలు వచ్చేలా పరిశ్రమలు ప్రత్యేకంగా బ్లాకులను విభజించనున్నారు. ఇప్పటికే ఇక్కడ మౌలిక వసతులు ఉన్నందున కొత్తగా ప్లాట్లను విభజించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా పరిశ్రమలకు భూములను కేటాయించనున్నారు. రానున్న ఒకటి, రెండు నెలల్లో కార్యకలాపాలను ప్రారంభించేందుకు టీజీఐఐసీ ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**భారత్ ఫ్యూచర్ సిటీతో అనుసంధానం..**

తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటు చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీతో అనుసంధానం చేయాలని టీజీఐఐసీ అధికారులు భావిస్తున్నారు. భారత్ ఫ్యూచర్‌సిటీకి, ఫ్యాబ్‌సిటీ మధ్య కేవలం 15 కిలోమీటర్ల దూరం ఉండటంతో అభివృద్ధిలో భాగంగా రోడ్లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నారు. ఐటీ, ఫార్మా సంస్థల నిర్మాణ పనులకు కీలకమైన విద్యుత్తు సౌకర్యం, వాటర్ ఫెసిలిటీ లభించేలా చర్యలు చేపట్టనున్నారు. ఫ్యాబ్‌సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీలకు ప్రస్తుతం హైదరాబాద్ శ్రీశైలం రోడ్డు, శంషాబాద్ గచ్చిబౌలి బాహ్య వలయ రహదారులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు ఫ్యూచర్ సిటీకి కొంగరకలాన్ నుంచి 330 అడుగుల హైవేను నిర్మిస్తున్నారు. వీటికి అదనంగా తుక్కుగూడ మీదుగా కొంగరకలాన్‌లోని రంగారెడ్డి కలెక్టరేట్ వరకూ మరో రోడ్డును సైతం ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే ఈ రహదారి పనులను కూడా ప్రారంభించేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది.



## కసాయి భర్త

- భార్యను చంపి నగలుతో పరారు


**ముద్ర ప్రతినిధి, మెదక్:**

భార్యను చంపడంతో పాటు ఆమె ఒంటిపై ఉన్న నగలు తీసుకొని పారిపోయిన సంఘటన మెదక్ జిల్లా చేగుంట రైల్వే స్టేషన్ రోడ్డులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చేగుంట మండల కేంద్రంలోని వెంకటేశ్వర టెంపుల్ ట్యాంక్ సమీపంలో నివసించే వరలక్ష్మి, ఆమె భర్త త్రిమూర్తి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఉదయం వివాదం కాస్త తీవ్ర రూపం దాల్చడంతో ఆవేశానికి లోనైన త్రిమూర్తి కత్తితో భార్య గొంతు కోసి హత్య చేశాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. మృతురాలి బావ సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్

- శివాజీ విగ్రహావిష్కరణకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- పెద్దశంకరంపేటలో ఉద్రిక్తత
- బీజేపీ, హిందూ సంఘాల నిరసన





**ముద్ర ప్రతినిధి, మెదక్:**

నిర్మల్ జిల్లా ఓలా గ్రామంలో శివాజీ విగ్రహావిష్కరణకు వెళ్తుండగా ఆదివారం గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్‌ను మెదక్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్ద శంకరంపేట్ హైవే మీదుగా వెళ్లుతున్నారనే సమాచారం మేరకు మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో సమీపంలోని కింగ్స్ 9 రెస్టారెంట్ వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ నేతృత్వంలో ఆ పార్టీ నాయకులతో పాటు హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఎమ్మెల్యేను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై నిరసన కొనసాగించారు. హైదరాబాద్ నుంచి పిట్లం, బిచ్కుంద వైపు వెళ్తున్న బస్సును ఆపివేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారులు బస్సు అద్దంపై చేతితో బలంగా బాధడంతో స్వల్పంగా పగుళ్లు ఏర్పడ్డాయి. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు హైదరాబాద్‌కు తరలించారు.

**అరెస్ట్ అన్యాయం..**

ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తుండగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఇక్కడ పోలీసులు అరెస్ట్ చేయడం వల్ల కార్యకర్తలను కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఓలా గ్రామ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అక్కడ కూడా కొందరిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు.

**వ్యవసాయంలో టాప్ 9 దేశం**

**ఫ్రాన్స్ (France)**
యూరప్‌లో అతిపెద్ద వ్యవసాయ ఉత్పత్తి దేశం. వైన్, గోధుమ, పాల ఉత్పత్తిలో ముందుంది.



# మల్టీలేయర్ సైఫై థ్రిల్లర్‌గా కిల్లర్




**హైదరాబాద్, ముద్ర సినిమా న్యూస్ :**

మల్టీలేయర్ సైఫై థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'కిల్లర్' సినిమా టీజర్ హైదరాబాద్‌లో విడుదలై మంచి స్పందన పొందుతోంది. జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో, సుకు పూర్వాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్లపై పూర్వాజ్, పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమోషన్, రివెంజ్, సబ్‌కాన్షియస్ ఐడెంటిటీ అంశాలతో మహిళా ప్రధాన కథగా ఈ సినిమాను రూపొందించినట్లు దర్శకుడు తెలిపారు. జ్యోతి పూర్వాజ్ ఈ చిత్రంలో ఆరు భిన్నమైన పాత్రల్లో కనిపించనుండగా, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చిత్ర యూనిట్ సభ్యులు కూడా సినిమా కంటెంట్‌పై నమ్మకం వ్యక్తం చేశారు. లైన్ ప్రొడ్యూసర్లు సీతారామరావు, దశరథ మాధవ్‌లు మంచి కథతో పాటు బ్రదర్‌సిస్టర్ సెంటిమెంట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. విలన్ పాత్రలో నటించిన మనీష్ గిలాడ తన పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని చెప్పారు. యాక్షన్ సీక్వెన్సులు ప్రత్యేకంగా నిలుస్తాయని గౌతమ్ చక్రధర్ తెలిపారు. టెక్నికల్ క్వాలిటీ విషయంలో సినిమా కొత్త అనుభూతి ఇస్తుందని విశాల్ రాజ్ పేర్కొన్నారు. మనీష్ గిలాడ విలన్‌గా నటించగా, యాక్షన్ సీక్వెన్సులు, టెక్నికల్ విలువలు సినిమాకు హైలైట్ అవుతాయని చిత్ర బృందం తెలిపింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని యూనిట్ నమ్మకం వ్యక్తం చేసింది. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.




## కార్యకర్తల శ్రమతోనే కాంగ్రెస్ విజయాలు : బండి రమేష్

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు సన్మానం
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ముద్ర, హైదరాబాద్ :**

పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్చార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన పార్లమెంట్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో పాటు ఇటీవల నిర్వహించిన పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేయడం శుభపరిణామమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బలంగా చేరడంతోనే కాంగ్రెస్‌కు విస్తృత మద్దతు లభిస్తోందని తెలిపారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో పనిచేసి మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కార్యకర్తల గట్టి పోరాటం వల్లే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అద్భుత విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రజా క్షేత్రంలో నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## నేటి నుంచి ప్రజావాణి యథాతథం

- కలెక్టర్ ప్రతీక్ జైన్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం 23వ తేది సోమవారం నుంచి జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యథాతథంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.



## జూబ్లీహిల్స్‌లో ఫెరారీ బీభత్సం

- మూడు కార్లు దెబ్బతినడంతో భారీ ట్రాఫిక్ జాం

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్ నెం.45వద్ద వేగంగా ప్రయాణిస్తున్న ఫెరారీ కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి, మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ ప్రభావంతో కారు రోడ్డుకు అవతలివైపు వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడంతో భారీ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఫెరారీ కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో మొత్తం మూడు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరికొన్ని ద్విచక్ర వాహనాలు కూడా ఈ ప్రమాదంలో నష్టపోయినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ఫెరారీ కారులో ఎయిర్‌బ్యాగులు ఓపెన్ కావడంతో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయితే స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మరోవైపు గాయపడిన పలువురిని స్థానికులు సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాద సమయంలో కారు అతివేగంతో నడిపినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం కారణంగా రోడ్ నెం.45లో భారీ ట్రాఫిక్ జాం ఏర్పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి గురైన ఫెరారీ కారు వెంకట రాజారెడ్డి పేరుతో రిజిస్టర్ అయి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన మరోసారి నగరంలో అతివేగ డ్రైవింగ్ ప్రమాదకరమని గుర్తుచేసింది. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

# కరీంనగర్ కొత్త కొలువు.. సవాళ్ల పెద్ద కొలువు!

- కొత్త పాలకవర్గానికి సరికొత్త సవాళ్లు
- ముందుంది ముసళ్ల పండగ
- అసంపూర్తి పనులు పూర్తయ్యేనా?
- నగర సుందరీకరణపై ఆశలు
- అవినీతి అనకొండలపై కొరడా ఝులిపిస్తారా..?

**ముద్ర ప్రతినిధి, కరీంనగర్:**



కరీంనగర్ కార్పొరేషన్ గా మారిన తరువాత నగరం నాలుగు చెరుగులా విస్తరించింది. ఊహించని రీతిలో చుట్టు ఉన్న గ్రామాలు నగరంలో విలీనమయ్యాయి. ప్రధాన రహదారి తప్ప, అంతర్గత రోడ్లు, కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదు. గత పాలకులు అభివృద్ధి పేరుతో దోపిడికి పాల్పడ్డారని, కబ్జాలు చేసి ప్రజల్లో చులకన అయ్యారని మున్సిపల్ ఎన్నికల్లో పెద్దఎత్తున దుమ్మెత్తి పోసి 66 డివిజన్లలలో 30 డివిజన్లు కైవసం చేసుకుని మేయర్ పీఠాన్ని అధిష్ఠించిన బీజేపీ నూతన పాలకవర్గం సరికొత్త సవాళ్లను ఎదుర్కొబోతుంది. నగరంలో అసంపూర్తి పనులు వెక్కిరిస్తున్నాయి. వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. తమకు ఒక్క అవకాశమివ్వండి.. నగరం రూపురేఖలు మారుస్తామని గద్దెనెక్కిన కొత్త పాలకవర్గంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. పాలకవర్గం ఎంత వరకు ఈ సమస్యలపై దృష్టి సారిస్తుందో చూడాలి..

**అసంపూర్తిగా రోడ్డు పనులు..**

స్మార్ట్ సిటీ అయిన తరువాత కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులు, జంక్షన్ల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అంతర్గత రోడ్లు, డివిజన్లలలో చిన్న కాలనీలకు సంబంధించిన లింక్ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో సీఎం హామీ పథకం కింద రూ.130కోట్లతో నగరంలో 60 రోడ్ల పనులు చేపట్టారు. వాటిలో సగం పనులు ప్రారంభించినా, రాష్ట్ర ప్రభుత్వం మారగానే సదరు కాంట్రాక్టర్లు ఆ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో రెండేళ్ల నుంచి అసంపూర్తి పనులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్య..**

నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలనొప్పిగా మారాయి. ప్రధాన రహదారుల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కార్యాలయాల వేళల్లో విపరీతమైన రద్దీ వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరమైన కూడళ్లలో లేకపోవడంతో వాహనాలు గంటలకొద్ది జామ్ అవుతున్నాయి. సిగ్నల్ లు ఉన్న కూడళ్లలో ఎక్కువ సమయం వాహనాల నిరీక్షణ వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్పాత్లు, రోడ్ల ఆక్రమణలు ట్రాఫిక్ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ రోడ్లతో ఫుట్పాత్లు ఏర్పాటు చేయడంతో, అవి కాస్త ఇరుకుగా మారాయి, పైగా ఫుట్పాత్లు, రోడ్లపై వ్యాపారాలు సాగిస్తుండడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. రోడ్లు కూడా నాణ్యత కోల్పోయాయి.

**24గంటలు నీటి సరఫరా ఎక్కడా..?**

రాష్ట్రంలోనే మొదటిసారిగా 24 గంటలు తాగునీటి సరఫరా చేస్తున్న నగరంగా గుర్తింపు పొందిన కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని చాలా డివిజన్లలో నీటి ఎద్దడి పట్టి పీడిస్తున్నది. హౌసింగ్ బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల నీటి సరఫరాను ప్రారంభించినప్పటికి, పూర్తిస్థాయిలో అమలుకావడం లేదు. మిగతా రిజర్వాయర్ల పరిధిలో ప్రతి రోజు తాగునీటి సరఫరా జర గాల్సి ఉండగా, కోతిరాంపూర్, అంబేడ్కర్, కోర్టు రిజర్వాయర్ల పరిధిల్లో రెండు రోజులకో మారు అది కూడా సరిపడా నీరు రావడం లేదు. నగరవ్యాప్తంగా నల్లా పైప్ లైన్ లీకేజీ నిత్య సమస్యగా మారింది. కమాన్, రాంపూర్. కోర్టు, నాకా చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్లపై పైప్ లైన్ లీకేజీలు కనిపిస్తాయి. వీటి వల్ల తాగునీరు కలుషితం అవుతోంది. రోజుల తరబడి లీకేజీతో రోడ్లపై నీళ్లు వరదలా పారుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. లీకేజీతో రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయని ఆ శాఖ అధికారులు అంటున్నారు.

**వర్షా కాలంలో ముంపు తప్పదు..**

ఇక వర్షాకాలంలో నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు లెక్కలేదు. రోడ్ల నిర్మాణంలో చూపిన శ్రద్ధ డ్రెయినేజీలపై చూపలేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, నగరంలోని ముకరాంపుర, శర్మనగర్, ఆర్టీసీ వర్క్ షాప్, రాం నగర్, కోతిరాంపూర్ తదితర ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయి. ఆర్అండ్ బీ కల్వర్టులు చిన్నగా ఉండడం, పూడిక పేరుకుపోవడం, డ్రైనేజీల లింకులు సక్రమంగా లేకపోవడంతో వరద నీరు ముందుకు వెళ్లలేక సమీపంలోని ఇళ్లు, చౌరస్తాలను ముంచుతున్నాయి. ముకరాంపురలోని విమానం వీధి ప్రతిసారి వరద ముంపును ఎదుర్కొంటూనే ఉంది.

**చిమ్మచీకట్లో కాలనీలు..**

వీధి దీపాల నిర్వహణ నగరంలో సమస్యగా మారింది. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతో నిర్వహణ లేక వీధి దీపాలు లేక చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. టవర్ సర్కిల్, కలెక్టరేట్, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ లైట్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అప్పుడప్పుడు అలంకారప్రాయంగా మారుతున్నాయి.

**బస్ షెల్టర్లను పట్టించుకోరూ..**

నగరంలో బస్ షెల్టర్ల ఏర్పాటులో విచిత్ర పరిస్థితి నెలకొంది. కావాల్సిన చోట్ల షెల్టర్లు లేక, షెల్టర్లు ఉన్న చోట నిరుపయోగంగా ఉంటున్నాయి. బస్ కోసం ఎదురుచూసే క్రమంలో రోడ్డుపైనే నిలబడడం, లేదా చెట్టునో, షాప్ రేకులనో ఆశ్రయించాల్సివస్తోంది.

**కోతులు, కుక్కల బెడద తప్పదా..**

నగరంలో కోతులు, కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. కోతులు గుంపులుగా ఇండ్ల పైకి వస్తుండడంతో నగరవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇండ్లల్లోకి చొరబడి తినుబండారాలు, నిత్యావసర వస్తువులు పట్టుకెళ్తున్నాయి. రోడ్లపై, నివాసాల నడుమ కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయోత్పతాన్ని సృష్టిస్తున్నాయి.

**పారిశుధ్యం గాలికి..**

*నగరంలో పారిశుధ్యం నిర్వహణ సమస్యగా మారుతోంది. ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి తడి. పొడి చెత్తను వేర్వేరుగా తీసుకెళ్లాల్సిన స్వచ్ఛ ఆటోలు కొన్ని డివిజన్లలో సక్రమంగా వెళ్లడం లేదు. రెండు రోజులకు ఒకసారి కూడా వెళ్లని డివిజన్లు కూడా ఉన్నాయి. దీనితో పలు డివిజన్లలో ఇండ్లల్లో చెత్త పేరుకుపోతోంది. వాణిజ్యపరంగా చెత్త సేకరణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడంతోనూ, కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించడం సంవత్సరానికి ఒకసారి కూడా జరగని ప్రాంతాలున్నాయి.*

# బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలి

- మంత్రి వాకిటి శ్రీహరి

ముద్ర, తెలంగాణ బ్యూరో :



రాష్ట్రంలో ఉన్న 90కి పైగా ఉన్న బీసీ కులాలు తమ హక్కుల సాధనకు ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు సముచిత న్యాయం జరగాలంటే 42శాతం రిజర్వేషన్లు అవసరమని స్పష్టం చేశారు. బీసీ సమాజంలో మార్పు ప్రారంభమైందన్న ఆయన తమ లక్ష్యసాధన కోసం బీసీ సమాజం మొత్తం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బీసీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక విధానం రూపకల్పనలో నిమగ్నమైనట్లు వివరించారు. ఆదివారం శంషాబాద్ లోని సిద్ధాంతిలో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్నిఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముదిరాజ్ ల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉందన్నారు. వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కమ్యూనిటీ భవనాలు దోహదపడాలని మంత్రి ఆకాంక్షించారు. రాబోయే బడ్జెట్‌లో బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. కోకాపేటలో నిర్మించనున్న ముదిరాజ్ భవనానికి కూడా తగిన నిధులు కేటాయించాలని కోరనున్నట్లు చెప్పారు. శంషాబాద్‌లో ముదిరాజ్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషి చేసిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. శంషాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మెరుగు సురేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి, శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ ముదిరాజ్, మాజీ జెడ్పిటిసి తన్వి రాజు ముదిరాజ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీ ఐసెట్ కోసం టిసాట్ స్పెషల్ డిజిటల్ లెసన్స్

- నేటి నుంచి ప్రసారాలు
- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

**ముద్ర, శేరిలింగంపల్లి :**




పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టిసాట్ నెట్వర్క్ తెలంగాణ ఐసెట్ 2026 పరీక్షలకు సైతం డిటిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎం.బి.ఎ మరియు ఎం.సి.ఎ అర్హత పరీక్ష ఐసెట్ కోసం నేటి నుంచి ప్రసారాలు మొదలవుతాయని వెల్లడించారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్2026 మే 13, 14 తేదీల్లో జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని తెలిపారు. విద్యా ఛానల్లో ఉదయం 5గంటల నుంచి 6గంటల వరకు, నిపుణ ఛానల్ లో సాయంత్రం 5గంటల నుంచి 6 గంటల వరకు డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయని సీఈవో తెలిపారు. తెలంగాణాలోని విద్యార్థులు టిసాట్ డిజిటల్ లెసన్స్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23-02-2026
www.mudranews.in | @mudranews



## ఇదో వింత గోల్



1949లో ఒకఫుట్‌బాల్ మ్యాచ్‌లో రిఫరీ పొరపాటున తానే గోల్ కొట్టి, దాన్ని చెల్లుబాటు అయ్యేలా ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

# కొదమసింహాల్లా తలపడ్డారు..

## - రక్తికట్టిన భారత్ vs దక్షిణాఫ్రికా మ్యాచ్



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
స్పోర్ట్స్ డెస్క్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు ఆదిలోనే షాక్ తగిలింది. జస్ప్రీత్ బుమ్రా ధాటికి కేవలం 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో డేవిడ్ మిల్లర్ (63), యువ సంచలనం డెవాల్డ్ బ్రేవిస్ (45) అద్భుత పోరాటాన్ని కనబరిచారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు.చివరి ఓవర్లో స్టబ్స్ విధ్వంసంమిడిల్ ఓవర్లలో మిల్లర్ మెరుపులు మెరిపించగా, చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (44 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్టబ్స్ ఒక ఫోర్, రెండు సిక్సర్లతో ఏకంగా 20 పరుగులు రాబట్టాడు. దీంతో దక్షిణాఫ్రికా స్కోరు 180 మార్కును దాటింది.బుమ్రా రికార్డు.. హార్దిక్ వైఫల్యంభారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా మరోసారి తన క్లాస్ చూపించాడు. 4 ఓవర్లలో కేవలం 15 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో టీ20 వరల్డ్ కప్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా (అశ్విన్‌ను అధిగమించి) రికార్డు సృష్టించాడు. అయితే, హార్దిక్ పాండ్యా (0/45) ధారాళంగా పరుగులు ఇవ్వడం టీమ్ ఇండియాకు మైనస్‌గా మారింది.లంకను ముంచిన ఇంగ్లండ్మరోవైపు పల్లెకెలె వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ అదరగొట్టింది. శ్రీలంకను వారి సొంత గడ్డపైనే 51 పరుగుల తేడాతో చిత్తు చేసి సూపర్–8లో ఘనంగా బోణీ కొట్టింది.

### రన్నర్ , విన్నర్ ఫైటింగ్

టోర్నమెంట్‌లో టైటిల్ ఫేవరెట్‌గా భారత్ బరిలోకి దిగింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత జట్టు బలమైన బ్యాటింగ్ లైనప్‌తో పాటు స్పిన్ దళంతో ప్రత్యర్థి సౌతాఫ్రికాకు సవాల్ విసిరింది.. సూర్యకుమార్ యాదవ్, సంచి కిషన్, తిలక్, హార్దిక్, దూబే , బుమ్రా లాంటి స్టార్ ఆటగాళ్లతో టీమిండియా భీకరంగా పోరాడింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం పిచ్ ప్రారంభంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండి, తర్వాత స్పిన్నర్లకు సహకరించింది.. అందువల్ల అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి వంటి స్పిన్నర్లు కీలకంగా బౌలింగ్ చేశారు. ఇటీవల వార్మప్ మ్యాచ్‌లో భారత్ 240 పరుగులు చేసి దక్షిణాఫ్రికాపై 30 పరుగుల తేడాతో విజయం సాధించడం జట్టుకు మంచి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అదే ఊపు నిన్నటి మ్యాచ్ లోనూ కనిపించింది.

దక్షిణాఫ్రికా జట్టు కూడా తక్కువేమీ కాదు. 2024 ఫైనలిస్టులైన వారు రబాడా, లుంగి ఎంగిడి వంటి ఫాస్ట్ బౌలర్లతో పాటు మార్కో జాన్సన్ వంటి ఆల్‌రౌండర్లతో బలంగా టీమిండియాకు పోటీనిచ్చింది.. క్వింటన్ డి కాక్, మార్కం, స్టబ్స్, డెవిస్ వంటి బ్యాటర్లు టీమిండియాకు గట్టిపోటినిచ్చారు.. అయితే ఉపఖండ పరిస్థితుల్లో స్పిన్ బౌలింగ్‌కు ఎదుర్కోవడంలో సౌతాఫ్రికా బలహీనత కనిపించింది. ఈ మ్యాచ్ లో రెండు జట్లు భీకరంగా పోరాడాయి..

# కాటేరమ్మ కొడుకు అతడు..

**● విధ్వంసక వీరుడు.. ● అభిషేక్ శర్మకు నిరీక్షణే ఒక ఆయుధం! ● తక్కువ అంచనా వేయొద్దు ● అభిషేక్ పై సూర్య, గంభీర్ కు నమ్మకం ● ఫామ్ లో లేకున్నా పూర్తి మద్దతు**





**క్రికెట్ అనేది కేవలం గణాంకాల ఆట మాత్రమే కాదు.. అది నమ్మకానికి సంబంధించిన క్రీడ కూడా. ప్రస్తుతం టీమ్ ఇండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎదుర్కొంటున్న ఫామ్ లేమిపై వస్తున్న విమర్శలకు మేనేజ్‌మెంట్ ఇచ్చిన సమాధానం ఒక స్పష్టమైన సంకేతాన్ని పంపింది. "అభిషేక్ ఫామ్‌పై మాకు ఆందోళన లేదు.. అతడిని ఎదుర్కోబోయే ప్రత్యర్థుల గురించే మా ఆందోళన" అన్న మాటలు ఆ యువ ఆటగాడిలో ఎంతటి ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.**

### నమ్మకమే పెట్టుబడిగా..

ఏదైనా ఒక పెద్ద ఇన్నింగ్స్ ఆడే ముందు నిశ్శబ్దం ఆవరించడం సహజం. అభిషేక్ శర్మ శైలి విలక్షణమైనది. క్రీజులోకి వచ్చిన మొదటి బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడటం అతని నైజం. గత ఏడాది ఐపీఎల్ నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు అతను సృష్టించిన విధ్వంసం అందరికీ తెలిసిందే. ఒకట్రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన అతని సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయడం భావ్యం కాదు."కాటేరమ్మ కొడుకు అతడు.. తక్కువ అంచనా వేయొద్దు" ఈ వ్యాఖ్యలో ఉన్న గాంభీర్యం అభిషేక్ రేపబోయే తుపానుకు నిదర్శనం.

### జట్టు సమన్వయం - ఆటగాళ్లకు మద్దతు

జట్టులో ఒక ఆటగాడు విఫలమైనప్పుడు మిగిలిన వారు ఆ బాధ్యతను పంచుకోవడం ఒక అత్యుత్తమ జట్టు లక్షణం. ప్రస్తుతం టీమ్ ఇండియా అదే చేస్తోంది. అభిషేక్ కోసం మిగతా బ్యాటర్లు పరుగులు చేస్తూ అతనికి సమయాన్ని ఇస్తున్నారు. సంజు శాంసన్ లేదా తిలక్ వర్మ వంటి ప్రతిభావంతులు రేసులో ఉన్నప్పటికీ, ఒక ఆటగాడికి వరుస అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించడం వల్ల భవిష్యత్తులో అతను జట్టుకు వెన్నెముకగా మారే అవకాశం ఉంటుంది.

### ప్రత్యర్థులకు హెచ్చరిక

అభిషేక్ శర్మ వంటి 'ఇంపాక్ట్ ప్లేయర్' ఒక్కసారి కుదురుకుంటే స్కోరు బోర్డు ఎంత వేగంగా కదులుతుందో గతంలో చూశాం.పవర్ ప్లేను పూర్తిగా వాడుకోవడం... వైఫల్యాల నుంచి త్వరగా కోలుకునే తత్వం. బౌలర్ ఎవరైనా తన సహజ సిద్ధమైన షాట్లు ఆడటం. ప్రస్తుతం పరుగుల ఖాతా తెరవడానికి అతను పడుతున్న శ్రమ చూస్తుంటే, అది ఒక భారీ సునామీకి ముందున్న ప్రశాంతతలా కనిపిస్తోంది. రన్స్ రాబట్టడం మొదలైతే, అతడిని ఆపడం ఏ బౌలర్‌కైనా కత్తిమీద సామే.

విమర్శలు రావడం సహజం, కానీ వాటిని పక్కన పెట్టి ఆటగాడి ప్రతిభను గుర్తించడం ముఖ్యం. అభిషేక్ శర్మ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం సమర్థనీయమైనది. రేపు అతను మైదానంలో చేసే పరుగుల వర్షమే విమర్శకులకు సరైన సమాధానం కానుంది. ప్రత్యర్థి జట్లు సిద్ధంగా ఉండాల్సిందే!



# చిరిగిన షూ నుంచి వరల్డ్ స్టేజ్ దాకా..

## 103 మీటర్ల సిక్సర్‌తో మెరిసిన బర్ల్

**ముద్ర , స్పోర్ట్స్ డెస్క్ :**
చిరిగిన షూతో తన కష్టాలను ప్రపంచానికి తెలియజేసుకున్న జింబాబ్వే ఆల్‌రౌండర్ ర్యాన్ బర్ల్... ఇప్పుడు వరల్డ్ స్టేజ్‌పై సంచలనం సృష్టిస్తున్నాడు. ఒకప్పుడు షూల కోసం సోషల్ మీడియాలో విజ్ఞప్తి చేసిన ఈ ఆటగాడు, ఇప్పుడు భారీ సిక్సర్లతో మ్యాచ్‌ల గమనాన్ని మార్చే స్థాయికి ఎదిగాడు.

2021లో బర్ల్ తన చిరిగిన షూ ఫోటోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ జింబాబ్వే క్రికెటర్ల పరిస్థితిని వెల్లడించాడు. ఆ పోస్టు వైరల్ కావడంతో ఒక స్పోర్ట్స్ సంస్థ అతనికి సహాయం అందించింది. ఆ సంఘటన అతని జీవితంలో మలుపుగా నిలిచింది.

ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్ కప్‌లో బర్ల్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో స్పిన్నర్ దునిత్ వెల్లలాగే బౌలింగ్‌లో అతను 103 మీటర్ల భారీ సిక్సర్ బాదాడు. ఈ టోర్నీలో మూడో పొడవైన సిక్సర్‌గా నిలిచిన ఈ షాట్ మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేసింది. గ్రూప్ 'బి'లో జింబాబ్వే టాప్‌లో నిలవడంలో ఇది కీలకంగా మారింది.

అదే మ్యాచ్‌లో బ్రియాన్ బెన్నెట్, కెప్టెన్ సికందర్ రజా కూడా కీలక ఇన్నింగ్స్ ఆడినా... హెడ్లైన్స్ మాత్రం బర్ల్‌కే దక్కాయి. గ్రూప్ దశలో నంబర్–3 స్థానంలో బ్యాటింగ్ చేసిన బర్ల్ 58 పరుగులు చేసి 138 స్ట్రైక్‌రేట్‌తో మెరిశాడు. బౌలింగ్‌లో కూడా మూడు మ్యాచ్‌ల్లో రెండు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రదర్శన చూపించాడు.

ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో బర్ల్ అసలైన మాయ చూపించాడు. 170 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గ్లెన్ మ్యాక్స్‌వెల్, మ్యాట్ రెన్‌షా భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా బలంగా కనిపించిన వేళ, బర్ల్ ఒకే ఓవర్‌లో మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్‌లను ఔట్ చేసి మ్యాచ్‌ను పూర్తిగా తారుమారు చేశాడు. ఆ విజయం ఆస్ట్రేలియా అవకాశాలను దెబ్బతీసింది.తర్వాత ఐర్లాండ్‌తో వర్షం కారణంగా నిలిచిన మ్యాచ్‌లో ఒక పాయింట్ సాధించిన జింబాబ్వే, శ్రీలంకపై గెలిచి సూపర్–8 దశకు అర్హత సాధించింది. 2024 వరల్డ్ కప్‌కు అర్హత సాధించలేకపోయిన జట్టుకు ఇది గొప్ప పునరాగమనంగా నిలిచింది.ఇప్పుడీ జట్టు ముందుకు వెస్టిండీస్, భారత్, దక్షిణాఫ్రికా వంటి బలమైన ప్రత్యర్థులు ఉన్నా... పెద్ద వేదికపై ఆశ్చర్యాలు సృష్టించే సామర్థ్యం తమకుందని జింబాబ్వే ఇప్పటికే నిరూపించింది. ఈ విజయగాథలో ర్యాన్ బర్ల్ నిజమైన హీరోగా నిలిచాడు.




## రిక్షా డ్రైవర్ కొడుకు..
# కసిగా ఆడి కోటీశ్వరుడయ్యాడు

### మహ్మద్ సిరాజ్ ఎన్ని కోట్లకు ఎదిగాడో తెలుసా?



కష్టే ఫలి అంటారు కదా.. ఇది టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్ కు అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. ఒకప్పుడు ఆటోలో వెళ్లడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి అతడిది. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ రంజీ నుంచి జాతీయ స్థాయి దాకా తన ప్రస్థానాన్ని సాగించాడు. టీమిండియాలో కీలకమైన బౌలర్ గా ఆవిర్భవించాడు. టీ 20, టెస్ట్, వన్డే ఫార్మాట్లలో తిరుగులేని స్థాయిలో నిలిచాడు.ప్రస్తుత టీ20 వరల్డ్ కప్ లో హర్షిత్ రాణా స్థానంలో అతడు చోటు దక్కించుకున్నాడు. తుదిజట్టులో కూడా స్థానం సంపాదించాడు. అద్భుతమైన ప్రదర్శన చేస్తూ ఆకట్టుకుం టున్నాడు. పేద కుటుంబం నుంచి వచ్చిన సిరాజ్.. క్రికెట్ లో గొప్పగా రాణించడానికి ఎన్నో కష్టాలు పడ్డాడు. ఉత్తమమైన బౌలర్ గా ఆవిర్భవించాడు.

సిరాజ్ భారత జట్టులో కీలకమైన బౌలర్ గా కొనసాగుతున్నాడు. అంతేకాదు, మ్యాచ్ ఫీజు, వాణిజ్య ప్రకటనలు, ఐపీఎల్ ద్వారా భారీగా వెనకేసుకున్నాడు. అందువల్లే ఖరీదైన ఆస్తులను పోగేసుకున్నాడు. సిరాజ్ వద్ద ప్రస్తుతం ఉన్న ఆస్తులను లెక్కిస్తే అవి కోట్లలో ఉంటాయని తెలుస్తోంది.

సిరాజ్ దగ్గర రోలెక్స్ కాస్మోగ్రాఫ్ డే టోనా అనే వాచ్ ఉంది. దీని ధర 3.21 కోట్లవరకు ఉంటుంది.రేంజ్ రోవర్ కంపెనీకి చెందిన వోగ్ అనే మోడల్ కారు ఉంది. దీని ధర 3.36 కోట్లు.మెర్సిడెజ్ బెంజ్ లో ఎస్ క్లాస్ కారు కూడా ఉంది. దీని ధర రూ.1.86 కోట్లు.బీఎండబ్ల్యూ 5 సిరీస్ కారు ఉంది. దీని ధర 72.35 లక్షలు.జూబ్లీహిల్స్ ప్రాంతంలోని 13 కోట్ల విలాసవంతమైన భవనం ఉంది.

జూబ్లీహిల్స్ ప్రాంతంలోనే 600 చదరపు గజాల విలువైన రెసిడెన్సియల్ ప్లాట్ కూడా సిరాజ్ కు ఉంది.ఇటీవల సిరాజ్ రెస్టారెంట్ వ్యాపారంలోకి అడుగు పెట్టాడు. అందులో రకరకాల రుచులను అందుబాటులోకి తీసుకొచ్చాడు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 23.02.2026
www.mudranews.in | @mudranews



## టాలీవుడ్ టాప్ -4 హీరోలు


టాలీవుడ్‌లో ప్రస్తుతం టాప్ 4 హీరోలుగా ప్రభాస్, అల్లు అర్జున్, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్ పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. పాన్ ఇండియా మార్కెట్, భారీ కలెక్షన్లు, ఫ్యాన్ ఫాలోయింగ్ ఈ స్థానం తెచ్చాయి.

## 'వారణాసి'లో లక్ష్మణుడిగా అడివి శేష్?



సూపర్ స్టార్ మహేష్ బాబు—దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'వారణాసి'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కనిపిస్తాడన్న ప్రచారం ఇప్పటికే వైరల్ అయింది. ఆ లుక్‌కు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.ఇదిలా ఉండగా, సినిమాలో కీలకమైన లక్ష్మణుడి పాత్రకు టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్‌ను ఎంపిక చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. పాత్ర నిడివి తక్కువే అయినా, కథలో ప్రభావవంతంగా ఉంటుందట. గతంలో బాహుబలి 2: ది కన్‌క్లూజన్‌లో చిన్న పాత్రలో కనిపించిన శేష్, ఈసారి మరింత ప్రాధాన్యం ఉన్న రోల్‌లో కనిపించనున్నాడని టాక్.కథ సంజీవని నేపథ్యంలో సాగుతుందని, విలన్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నాడన్న సమాచారం ఉంది. అయితే ఈ వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది

## మే 15న మా ఇంటి బంగారం



క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఖరారైంది. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం మే 15న థియేటర్లలోకి రానుందని ప్రకటించారు. 'జబర్దస్త్', 'ఓ బేబీ' తర్వాత సమంత రూత్ ప్రభు—నందిని రెడ్డి కాంబినేషన్ లో వస్తున్న మూడో చిత్రం ఇది. ట్రాలాలా మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత తన భర్త రాజ్ నిడిమోరుతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్యతో పాటు దిగంత్, గౌతమి, శ్రీముఖి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పోస్టర్‌లో సమంత చీరకట్టులో గంభీర లుక్‌లో ఆకట్టుకుంది. ఈ చిత్రంలో సమంత మధ్యతరగతి గృహిణిగా, మరోవైపు లేడీ డాన్‌గా రెండు భిన్న కోణాల్లో కనిపించనుంది. ఆమె డైలాగులు తెలంగాణ యాసలో ఉండనున్నట్లు సమాచారం.

# ఉత్తమ నటుడు అల్లు అర్జున్..

## ఉత్తమ నటి నివేదా థామస్







**కనుల పండువగా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 70వ ఎడిషన్**

**పుష్ప 2 ప్రభంజనం.. అవార్డుల వర్షం..**

**దర్శకుడిగా సుకుమార్ ముద్ర**

**సంగీత విభాగంలో దూకుడు.. సహాయ నటీనటుల విభాగంలో మెరిసిన తారలు**

**క్రిటిక్స్ ఎంపికల్లో విభిన్న చిత్రాలకు ఆదరణ**

**టాలీవుడ్‌కు గౌరవాన్ని తెచ్చిన వేడుక**

కొచ్చి వేదికగా జరిగిన ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 70వ ఎడిషన్ వేడుక శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. 2024లో విడుదలైన చిత్రాలకు గాను అవార్డులను ప్రదానం చేశారు. ఈసారి అవార్డుల పరంగా పుష్ప 2 ఆధిపత్యం చాటింది. ఈ చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రంగా కూడా 'పుష్ప 2' నిలిచింది. అదే సినిమాకు దర్శకత్వం వహించిన సుకుమార్ ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ కూడా 'పుష్ప 2'కే దక్కింది.

ఉత్తమ నటి అవార్డును 35: చిన్నకథ కాదు చిత్రానికి గాను నివేదా థామస్ అందుకున్నారు. సహాయ నటుడిగా అమితాబ్ బచ్చన్ ('కల్కి 2898 ఏడీ'), సహాయ నటిగా అంజలి ('గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి') ఎంపికయ్యారు.

పరిచయ విభాగాల్లో 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి గాను యదు వంశీ ఉత్తమ దర్శకుడిగా, సందీప్ సరోజ్ ఉత్తమ నటుడిగా నిలిచారు. 'గం గం గణేశా'తో నయన్ సారిక ఉత్తమ పరిచయ నటిగా గుర్తింపు పొందింది.

సాహిత్య విభాగంలో 'దేవర' చిత్రంలోని 'చుట్టమల్లె' పాటకు రామజోగయ్య శాస్త్రి అవార్డు అందుకున్నారు. గాయకుల విభాగంలో శ్రీకృష్ణ ('కుర్చీ మడతపెట్టి' – గుంటూరు కారం), గాయని విభాగంలో శిల్పారావు ('చుట్టమల్లె') విజేతలయ్యారు.

క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ చిత్రంగా 'లక్కీ భాస్కర్', ఉత్తమ నటుడిగా తేజ సజ్జా, ఉత్తమ నటిగా కాజల్ అగర్వాల్ ('సత్యభామ') ఎంపికయ్యారు.

మొత్తం మీద ఈ ఏడాది ఫిల్మ్‌ఫేర్ సౌత్ వేడుక టాలీవుడ్‌కు విశేష గుర్తింపుని తీసుకొచ్చింది.



# 'జై హనుమాన్'

## షూట్స్ బిగిన్

హనుమాన్‌తో సంచలన విజయాన్ని అందుకున్న హీరో తేజా సజ్జా, దర్శకుడు ప్రశాంత్ వర్మ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. సుమారు రూ.40 కోట్ల వ్యయంతో రూపొందిన మైథాలజికల్ సూపర్ హీరో చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు సృష్టించింది. జాతీయ స్థాయిలో రెండు అవార్డులు అందుకోవడం ఈ సినిమాకు మరింత గుర్తింపు తీసుకొచ్చింది. క్లైమాక్స్‌లోనే సీక్వెల్‌కు సంకేతాలు ఇచ్చిన మేకర్స్, ఇప్పుడు అధికారికంగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.

'జై హనుమాన్' పేరుతో రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటించనున్నాడు. మొదట ప్రకటించిన తర్వాత కొంతకాలం ప్రాజెక్ట్‌పై అప్డేట్స్ లేకపోవడంతో ఇది ఆగిపోయిందన్న ప్రచారం జరిగింది. అయితే ఆ వదంతులకు తెరదించుతూ చిత్రాన్ని ఘనంగా లాంచ్ చేశారు.

హనుమంతుడి నేపథ్యంతో సాగే ఈ కథ, రామరావణ యుద్ధం అనంతరం చోటుచేసుకున్న సంఘటనలను ఆధారంగా చేసుకుని రూపొందుతోందని సమాచారం. హనుమంతుడికి శ్రీరాముడు ఇచ్చిన వాగ్దానం, దానిని నిలబెట్టేందుకు జరిగిన పరిణామాల చుట్టూ కథ తిరుగుతుందట.


ఈ చిత్ర ప్రారంభ వేడుకను పురాణాల్లో హనుమంతుడి జన్మస్థలంగా భావించే అంజనాద్రి బెట్టలో నిర్వహించడం విశేషం. కార్యక్రమంలో రిషబ్ శెట్టి, ప్రశాంత్ వర్మతో పాటు తేజా సజ్జా పాల్గొన్నారు. ఆ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో రానా దగ్గుబాటి కీలక పాత్రలో కనిపించనున్నాడు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందిస్తున్నారు. దాదాపు రూ.200 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం.

# అదృష్టం అంటే అను ఇమ్మాన్యుయేల్‌దే

## ఫ్లాప్స్ ఉన్నా.. వెంట పడుతున్న అవకాశాలు

సినీ పరిశ్రమలో హీరోలతో పోలిస్తే హీరోయిన్ల కెరీర్ సాధారణంగా తక్కువ కాలమే ఉంటుంది. విజయాలు వరుసగా వస్తేనే వారు ఎక్కువకాలం నిలదొక్కుకోగలుగుతారు. లేకపోతే కొద్ది అపజయాలకే అవకాశాలు తగ్గిపోతాయి. అయితే కొన్ని సందర్భాల్లో వరుస ఫ్లాప్స్ వచ్చినా క్రేజ్ కోల్పోకుండా ముందుకు సాగే నటీమణులు కూడా ఉంటారు. అలాంటి వారిలో అను ఇమ్మాన్యుయేల్ ఒకరు. 2016లో విడుదలైన మజ్నుతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు పొందింది. అనంతరం 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త', 'ఆక్సిజన్', 'అజ్ఞాత వాసి', 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండి యా', 'శైలజ రెడ్డి అల్లుడు', 'అల్లుడు అదుర్స్', 'మహాసముద్రం', 'ఊర్వశివో రాక్షసివో' వంటి పలు చిత్రాల్లో నటించింది.



ఈ సినిమాల్లో ఎక్కువ భాగం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, 'మజ్ను' మాత్రం ఆమె కెరీర్‌లో ప్రధాన విజయంగా నిలిచింది. తర్వాత 'ఊర్వశివో రాక్షసివో' సరాసరి విజయాన్ని అందుకుంది. వరుస అపజయాలు ఎదురైనా, అను ఇమ్మాన్యుయేల్‌కు ఇంకా క్రేజీ ప్రాజెక్టుల్లో అవకాశాలు రావడం విశేషంగా మారింది



## ఆ నిర్ణయం నా జీవితంలో బెస్ట్

**షాలిని పాండే**

అర్జున్ రెడ్డితో గుర్తింపు పొందిన షాలిని తన సినీ ప్రయాణంపై భావోద్వేగంగా స్పందించింది. నటిగా మారాలన్న లక్ష్యంతో ఇంటిని వదిలి వచ్చిన నిర్ణయం తన జీవితంలో తీసుకున్న అత్యుత్తమ నిర్ణయమని చెప్పింది. "మనసులో ఉన్న కలను వెంబడించకపోతే ఈరోజు సంతోషంగా ఉండేదాన్నని అనుకోవడం లేదు" అంటూ తన అనుభవాన్ని పంచుకుంది. వారసత్వం లేకుండా పరిశ్రమలో నిలదొక్కుకోవడం సవాలే అయినా, ఓర్పు , నిరంతర ప్రయత్నమే విజయానికి మార్గమని ఆమె పేర్కొంది. ఈ ప్రయాణం తనకు సహనం, ఆత్మవిశ్వాసం, స్థిరత్వం వంటి విలువలను నేర్పిందని తెలిపింది.ఇటీవల ఆమె వెబ్‌సిరీస్‌లతో పాటు పలు చిత్రాల్లో నటిస్తోంది. తెలుగులో చివరిసారిగా నిశ్శబ్దంలో కనిపించిన ఆమె, ప్రస్తుతం బాలీవుడ్‌పై దృష్టి సారించింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of Mis Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413.email: mudradaily@gmail.com